

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 02 | సంచిక: 333 | హైదరాబాద్ | సోమవారం | 11-05-2026 | పేజీలు: 08






# దేశ ఆర్థికాభివృద్ధికి సైబరాబాద్ కీలకం

**తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకారం**
**రూ.9,377 కోట్ల ప్రాజెక్టులను ప్రారంభించిన ప్రధాని మోదీ**
**హైదరాబాద్‌లో వర్చువల్‌గా**
**పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**
**జహీరాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి శ్రీకారం**
**వరంగల్‌లో పీఎం మిత్ర మెగా**
**టెక్స్‌టైల్ పార్కుతో భారీ ఉద్యోగావకాశాలు**
**జాతీయ రహదారి 167 విస్తరణతో రవాణాకు కొత్త ఊపు**
**కాజీపేట-విజయవాడ మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టుకు ప్రారంభం**
**హైదరాబాద్ సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ పీవోఎల్ ప్రాజెక్టు అందుబాటులోకి**
**విద్యుత్, ఈవీ, సైబర్ టెక్నాలజీ రంగాల్లో**
**తెలంగాణ వేగంగా ఎదుగుతోందన్న మోదీ**
**తెలంగాణకు కేంద్రం లక్షల కోట్లతో**
**మౌలిక వసతుల అభివృద్ధి చేస్తోందని వెల్లడి**
**అభివృద్ధి, ఉపాధి, పారిశ్రామిక రంగాల్లో**
**తెలంగాణకు కొత్త దశ ప్రారంభమన్న ప్రధాని**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. ముఖ్యంగా సైబరాబాద్ దేశంలోనే అతిపెద్ద ఉపాధి కేంద్రంగా ఎదిగిందని, సైబర్ టెక్నాలజీ, విద్యుత్, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో రాష్ట్రం వేగంగా పురోగమిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని వర్చువల్‌గా రూ.9,377 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, మౌలిక వసతుల విస్తరణపై ఆయన విశేషంగా మాట్లాడారు. దేశాన్ని 'వికసిత్ భారత్ 2047' లక్ష్యంతో అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ప్రధాని తెలిపారు. ఇందులో తెలంగాణ వంటి రాష్ట్రాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పారిశ్రామికీకరణ, ..మిగతా 2లో

# పెద్ద మనసుతో సహకరించండి

**తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోదీ సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి వినతి**
**గుజరాత్ మోడల్ నిర్మాణంలో మన్మోహన్ సింగ్ సహకరించినట్టే తనకు మద్దతివ్వాలని విజ్ఞప్తి**
**2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతామని హామీ**
**రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా సమీక్షించాలని మనవి**



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ అభివృద్ధికి, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఐసీసీలో జరిగిన సభలో సీఎం రేవంత్ రెడ్డి హిందీలో ప్రసంగించి అందరి దృష్టిని ఆకర్షించారు. దేశాభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేస్తామని స్పష్టం చేస్తూనే, తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను ప్రధాని ముందుంచారు.కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడూ ..మిగతా 2లో

# తెలంగాణ అభివృద్ధికి సహకరించండి

**తెలంగాణ కీలక ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి**
**మోడీకి టీపీసీసీ చీఫ్ లేఖ.. మెట్రో, మూసీ ప్రాజెక్టులకు నిధుల విజ్ఞప్తి**
**తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రధాని మోడీకి లేఖ**
**రాష్ట్ర ప్రగతికి కీలక ప్రాజెక్టులపై కేంద్ర చొరవ కోరిన కాంగ్రెస్ నేత**
**హైదరాబాద్ మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర సహకారం అవసరం**



02



# భయపడటానికి ఫామ్‌హౌస్‌లో ఎలుకను కాదు..

**పరేడ్ గ్రౌండ్ సభలో బండి సంజయ్ ఫైర్.. కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు**
**'జై శ్రీరామ్‌తోనే బెంగాల్‌లో బీజేపీ గెలిచింది'.**
**తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుంది**
**సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించం**
**'జై శ్రీరామ్'పై కాంగ్రెస్ హేళన.. బీజేపీ కౌంటర్ అటాక్**
**సికింద్రాబాద్ సభలో బీజేపీ శక్తి ప్రదర్శన**
**కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై మండిపడ్డ బండి సంజయ్**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

జై శ్రీరామ్' అనే నినాదం వింటేనే కాంగ్రెస్ నేతలు భయపడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ (Bandi Sanjay) అన్నారు. ఇవాళ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'జై శ్రీరామ్' అంటే ..మిగతా 2లో

# తమిళనాడు సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకారం

తొలిరోజే మూడు సంచలన నిర్ణయాలు
చెన్నై నెహ్రూ స్టేడియంలో అట్టహాసంగా వేడుక
దశాబ్దాల ద్రవిడ పార్టీల ఆధిపత్యానికి తెర
'ఉచిత విద్యుత్' పథకానికి అధికారికంగా ఆమోదం
మహిళల రక్షణ కోసం ప్రత్యేక నిఘా విభాగం
డ్రగ్స్ అంతం చేసేందుకు ఈగల్ తరహా ప్రత్యేక బృందాలు
మంత్రులుగా ప్రమాణం చేసిన 9 మంది సభ్యులు
జాబితాలో సెంగోట్టియన్, కీర్తన వంటి కీలక నేతలు.
గత ప్రభుత్వ వైఫల్యాలపై 'శ్వేతపత్రం' విడుదల చేస్తామ వెల్లడి.
ప్రభుత్వంలో తానే ఏకైక అధికార కేంద్రమన్న సీఎం
బంధుప్రీతికి తావుండదని విజయ్ స్పష్టమైన సంకేతాలు

**చెన్నై, (ప్రజాక్షేత్రం):**

తమిళనాడు రాజకీయ చరిత్రలో ఒక నూతన శకం ఆరంభమైంది. ఆ రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా టీవీకే (తమిళగ వెట్రి కళగం) పార్టీ అధినేత జోసెఫ్ విజయ్ ఆదివారం అట్టహాసంగా బాధ్యతలు చేపట్టారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ చారిత్రక ఘట్టంలో రాష్ట్ర గవర్నర్ ఆర్లేకర్ ఆయనతో పదవీ స్వీకార ప్రమాణం చేయించారు. 1967 సంవత్సరం తర్వాత తమిళనాడును దశాబ్దాల పాటు శాసించిన డీఎంకే, అన్నాడీఎంకే పార్టీల ఆధిపత్యాన్ని బద్దలు కొడుతూ మరో పార్టీ అధికారంలోకి ..మిగతా 2లో



# ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి?

**తెలంగాణ అభివృద్ధికి 12 లక్షల కోట్లు ఇచ్చాం**
**5 వందేభారత్ రైళ్లు, 42 స్టేషన్ల అభివృద్ధి కేంద్రం కృషేనని వ్యాఖ్య**
**రాష్ట్ర ప్రభుత్వం మత రాజకీయాలు చేస్తోందని కాంగ్రెస్‌పై ఆరోపణలు**
**ముస్లింల కోసమే రేవంత్ ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శ**
**గాంధీ కుటుంబం చేతిలో తెలంగాణ బందీ అయిందన్న కేంద్ర మంత్రి**
**దేశంలోని 21 రాష్ట్రాల్లో బీజేపీ కూటమి అధికారంలో ఉందని ధీమా**
**తెలంగాణ విముక్తి 'మోదీ గ్యారంటీ'తోనే సాధ్యమని స్పష్టం**



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ అభివృద్ధి విషయంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ముఖ్యంగా ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన బీజేపీ భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రజలకు ..మిగతా 2లో

# రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నా రేవంత్ రెడ్డికి కనికరం లేదు

**వడ్ల కొనుగోళ్లలో రేవంత్ ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్**
**కొనుగోలు కేంద్రాల్లో రైతుల కన్నీళ్లు.. సీఎం స్పందించాలి**
**'ఢిల్లీ టూర్లు తప్ప రైతుల కష్టాలు కనిపించవా?'.. రేవంత్‌పై హరీశ్ ఫైర్**
**రాష్ట్ర రైతుల పరిస్థితి దయనీయంగా మారింది**
**వడ్ల కొనుగోళ్లపై కలెక్టర్ల సమావేశం కూడా పెట్టలేదా?**
**కర్ణాల్పల్లి కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడిన హరీశ్ రావు**
**70 లక్షల రైతుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా**
**రైతుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది**



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

రేవంత్ రెడ్డి ప్రభుత్వం వడ్ల కొనుగోలు విషయంలో దారుణంగా ఫెయిల్ అయ్యిందని రాష్ట్రంలో రైతుల పరిస్థితి చాలా దయనీయంగా మారిందని మాజీ మంత్రి హరీశ్ రావు (Harish Rao) విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ గ్రామానికి పోయినా కొనుగోలు కేంద్రాల్లో రైతులు ..మిగతా 2లో

# దేశ ఆర్థికాభివృద్ధికి సైబరాబాద్ కీలకం

మొదటిపేజీ తరువాయి

రహదారులు, రైల్వేలు, టెక్స్‌టైల్, ఇంధన రంగాల్లో కేంద్రం భారీ పెట్టుబడులు పెడుతోందని వెల్లడించారు.

**సైబరాబాద్ దేశానికి గ్రోత్ ఇంజిన్**

హైదరాబాద్ మహానగరం, ముఖ్యంగా సైబరాబాద్ ప్రాంతం దేశ ఆర్థికాభివృద్ధికి గ్రోత్ ఇంజిన్‌లా మారిందని ప్రధాని కొనియాడారు. ఐటీ, ఫార్మా, డిజిటల్ సేవలు, స్టార్టప్‌లు, ఈవీ తయారీ, డేటా సెంటర్లు వంటి రంగాల్లో తెలంగాణ విశేషంగా ముందుకు వెళ్తోందన్నారు. ప్రపంచ స్థాయి సంస్థలు హైదరాబాద్‌ను పెట్టుబడుల కేంద్రంగా ఎంచుకోవడం రాష్ట్ర సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోందని చెప్పారు.

ఇక్కడి యువత నైపుణ్యం, మౌలిక వసతులు, పారిశ్రామిక వాతావరణం కారణంగానే అనేక బహుళజాతి సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెడుతున్నాయని ప్రధాని వ్యాఖ్యానించారు. దీంతో ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతున్నాయని తెలిపారు.

**వరంగల్‌కు పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్క్**

వరంగల్‌లో ఏర్పాటు కానున్న 'పీఎం మిత్ర' కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ తెలంగాణ టెక్స్‌టైల్ రంగ చరిత్రలో కీలక మైలురాయిగా నిలుస్తుందని ప్రధాని అన్నారు. రూ.1,695.54 కోట్లతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పత్తి ఉత్పత్తిలో తెలంగాణకు ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని టెక్స్‌టైల్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఈ పార్క్ ద్వారా తయారీ యూనిట్లు, ఎగుమతులు, ముడిసరుకు సరఫరా వ్యవస్థలు, లాజిస్టిక్స్ రంగాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. దేశ టెక్స్‌టైల్ రంగాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.

**జహీరాబాద్‌లో స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రూ.2,360.54 కోట్లతో అభివృద్ధి చేయనున్న ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టును ప్రధాని ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా పారిశ్రామిక పెట్టుబడులు భారీగా ఆకర్షితమవుతాయని కేంద్రం భావిస్తోంది. ఆధునిక పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు, డిజిటల్ సదుపాయాలు, గ్రీన్ ఎనర్జీ ఆధారిత వ్యవస్థలు ఇందులో ఏర్పాటు కానున్నాయి.

ఈ స్మార్ట్ సిటీ ద్వారా దేశీయ, విదేశీ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టే అవకాశాలు మరింత పెరుగుతాయని అధికారులు పేర్కొంటున్నారు. పరిశ్రమల విస్తరణతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

**రహదారులు, రైల్వేల అభివృద్ధికి ప్రాధాన్యం**

జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని ప్రధాని వెల్లడించారు. తెలంగాణలో కూడా పలు కీలక రహదారి ప్రాజెక్టులు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా జాతీయ రహదారి 167 విస్తరణలో గుడెబల్లూర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు రూ.3,175 కోట్లతో చేపట్టిన పనులను ప్రారంభించారు.ఈ రహదారి అభివృద్ధి ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వ్యాపార, పారిశ్రామిక కార్యకలాపాలకు ఊతం లభిస్తుందని అధికారులు చెబుతున్నారు.ముఖ్యంగా దక్షిణ తెలంగాణ జిల్లాలకు ఈ ప్రాజెక్టు ఎంతో ఉపయోగపడనుంది.

అదేవిధంగా రూ.1,243 కోట్లతో చేపట్టిన 118 కిలోమీటర్ల కాజీపేటవిజయవాడ మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టు, రూ.292 కోట్లతో నిర్మిస్తున్న 21 కిలోమీటర్ల కాజీపేట రైల్ అండ్ రైల్ బైపాస్ లైన్లను కూడా ప్రధాని ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రైల్వే రవాణా సామర్థ్యం పెరిగి సరుకు రవాణా వేగవంతం కానుంది.

**ఇంధన రంగంలో కీలక అడుగు**

హైదరాబాద్ సమీపంలోని మల్కాపూర్ వద్ద రూ.611 కోట్లతో నిర్మించిన గ్రీన్‌ఫీల్డ్ పీవోఎల్ ప్రాజెక్టును ప్రధాని ప్రారంభించారు. ఇంధన నిల్వ, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఇంధన మౌలిక వసతులను కేంద్రం అభివృద్ధి చేస్తోందని ప్రధాని తెలిపారు.

**తెలంగాణకు కేంద్రం పూర్తి సహకారం**

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. మౌలిక వసతులు, పరిశ్రమలు, రవాణా, ఉపాధి, టెక్స్‌టైల్, డిజిటల్ రంగాల్లో రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి అంటే దేశాభివృద్ధేనని వ్యాఖ్యానించారు.

కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ప్రధాని అన్నారు. తెలంగాణ యువత దేశ అభివృద్ధిలో ముందుండాలని ఆకాంక్షించారు. అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో తెలంగాణ కీలక భాగస్వామిగా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# పెద్ద మనసుతో సహకరించండి

మొదటిపేజీ తరువాయి



మోదీ చాలా పెద్ద మనసున్న వారని చెబుతుంటారు, ఆ పెద్ద మనసుతో తెలంగాణ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని మోదీని రేవంత్ కోరారు. దేశ ప్రగతికి సంబంధించిన విషయాల్లో రాజకీయాలు చేయబోమని, వికసిత్ భారత్ నిర్మాణంలో తెలంగాణను భాగస్వామిని చేస్తామని ఆయన ప్రధానికి హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమం కేవలం కేంద్ర ప్రభుత్వానిది కాదని, ఇది తెలంగాణ అభివృద్ధి ఉత్సవమని రేవంత్ రెడ్డి అన్నారు. "ప్రధాని మోదీ వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని ప్రకటించిన రోజే, దానికి అనుగుణంగా మేం 'తెలంగాణ రైజింగ్ 2047' పాలసీ డాక్యుమెంట్‌ను విడుదల చేశాం. దేశాన్ని 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న మీ కలను సాకారం చేయడంలో తెలంగాణ 10% వాటాను అందిస్తుంది. దేశ జనాభాలో 3% కంటే తక్కువ ఉన్నప్పటికీ, దేశ జీడీపీలో 5% వాటాను తెలంగాణ అందిస్తోంది. రానున్న రోజుల్లో దీన్ని 10 శాతానికి పెంచడమే మా లక్ష్యం" అని వివరించారు.

ఈ లక్ష్య సాధన కోసం ఒక ఆసక్తికరమైన పోలికను ప్రధాని ముందుంచారు. "గతంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు, మీరు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆనాడు మీ 'గుజరాత్ మోడల్'కు ఆయన సహకరించారు. ఇప్పుడు మీరు ప్రధానిగా ఉండగా, నేను ముఖ్యమంత్రిగా ఉన్నాను. రాష్ట్ర ప్రజలు నాపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. రానున్న పదేళ్లలో 'తెలంగాణ మోడల్' నిర్మించి, 2034 నాటికి రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి మీ ఆశీస్సులు, సహకారం ఎంతో అవసరం" అని రేవంత్ విజ్ఞప్తి చేశారు.

దేశానికి ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్ నగరాలు గ్రోత్ ఇంజన్ల వంటివని, ఈ నగరాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ నగరాల నుంచి వచ్చే అభివృద్ధి ప్రతిపాదనలకు సత్వరమే అనుమతులు ఇచ్చేందుకు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)లో ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ లేదా సింగిల్ విండో వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణకు అత్యంత కీలకమైన రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు విస్తరణ, మూసీ నది సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ రేడియల్ రోడ్లు, హైదరాబాద్‌మచిలీపట్నం పోర్టు మధ్య 12 లైన్ల ఎక్స్‌ప్రెస్ హైవే, రైల్వే లైన్ వంటి పెండింగ్ ప్రాజెక్టులను సీఎం రేవంత్ ప్రస్తావించారు. "ఈ ప్రాజెక్టులపై చర్చించేందుకు తెలంగాణ కోసం ఒక రెండు గంటల సమయం కేటాయించి ప్రత్యేక సమీక్ష నిర్వహించండి. మా ప్రతిపాదనలన్నింటినీ మీ ముందు ఉంచుతాం" అని కోరారు.

# ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి?

మొదటిపేజీ తరువాయి



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు అమలు కాలేదని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో గొప్పలు చెప్పిన నాయకులు ఇప్పుడు ప్రజల ముందుకు రావడం లేదన్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, యువత కోసం ప్రకటించిన పథకాలు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ప్రజలను అబద్ధపు హామీలతో మభ్యపెట్టడం కాంగ్రెస్ పార్టీకి కొత్త కాదని, గతంలోనూ ఇదే విధానాన్ని అనుసరించిందని వ్యాఖ్యానించారు.

తెలంగాణ అభివృద్ధిలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వ పాత్ర ఎంతో కీలకమని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. గత 11 ఏళ్లలో తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం దాదాపు రూ.12 లక్షల కోట్ల నిధులను కేటాయించిందన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి కోసం మాత్రమే రూ.1.85 లక్షల కోట్లు మంజూరు చేశామని తెలిపారు. రాష్ట్రంలో రోడ్ల విస్తరణ, ఎక్స్‌ప్రెస్‌వేలు, ఫ్లైఓవర్లు, జాతీయ రహదారుల నిర్మాణం వంటి పనులు కేంద్ర నిధులతోనే జరుగుతున్నాయని పేర్కొన్నారు.

రైల్వే రంగంలోనూ తెలంగాణకు కేంద్రం పెద్దపీట వేసిందని ఆయన తెలిపారు. రాష్ట్రానికి ఐదు వందేభారత్ రైళ్లు కేటాయించామని, 42 రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామని వెల్లడించారు. అంతేకాకుండా మూడు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులను కూడా తెలంగాణకు అనుసంధానం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కేంద్రం చేపడుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం కావాలనే ప్రజలకు తెలియనీయకుండా చేస్తోందని ఆరోపించారు.

రాష్ట్రంలో అమలవుతున్న సన్నబియ్యం పథకానికి కూడా కేంద్ర ప్రభుత్వమే 80 శాతం నిధులు ఇస్తోందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. అయితే ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చెప్పకుండా తమకే క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. “ఇవన్నీ రాహుల్ గాంధీ ఇచ్చారా? లేక కేసీఆర్ తెచ్చారా? ఇది మోదీ ప్రభుత్వ నిబద్ధత కాదా?” అంటూ సభలో ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై కూడా కిషన్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితమైందని ఆరోపించారు. ముఖ్యంగా ముస్లింల కోసమే ప్రభుత్వం పనిచేస్తోందని, సమాజంలో విభజన రాజకీయాలకు కాంగ్రెస్ తెరలేపిందని మండిపడ్డారు. ‘SIR’ పేరుతో ప్రభుత్వం ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రజా సమస్యలను పక్కనబెట్టి మత రాజకీయాలపై దృష్టి పెట్టడం కాంగ్రెస్ అసలు స్వరూపమని విమర్శించారు.

గతంలో పదేళ్ల పాటు తెలంగాణ ఒకే కుటుంబ పాలనలో నలిగిపోయిందని, ఇప్పుడు గాంధీ కుటుంబం ఆధీనంలోకి వెళ్లిపోయిందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఒకప్పుడు బీఆర్‌ఎస్ కుటుంబ పాలనతో రాష్ట్రం నష్టపోయిందని, ఇప్పుడు కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాలకే రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే ప్రభుత్వం బీజేపీ మాత్రమేనని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ అబద్ధపు గ్యారంటీలతో ప్రజలను మోసం చేస్తుందని, కానీ బీజేపీ ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్రంలో వరుసగా మూడుసార్లు బీజేపీ అధికారంలోకి రావడానికి ఇదే ప్రధాన కారణమని తెలిపారు. ప్రజలు మోదీ నాయకత్వంపై విశ్వాసం ఉంచుతున్నారని, అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన వల్లే బీజేపీ దేశవ్యాప్తంగా బలపడుతోందన్నారు.

దేశంలోని 21 రాష్ట్రాల్లో బీజేపీ లేదా బీజేపీ కూటమి అధికారంలో ఉండటమే తమ పనితీరుకు నిదర్శనమని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కూడా బీజేపీ ప్రభావం రోజురోజుకు పెరుగుతోందని, గత పార్లమెంట్ ఎన్నికల్లో ఎనిమిది ఎంపీ స్థానాలు గెలుచుకోవడం ఇందుకు ఉదాహరణ అని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ మరింత బలపడుతుందని, ప్రజలు కాంగ్రెస్ మరియు బీఆర్‌ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా బీజేపీని చూస్తున్నారని అన్నారు.

తెలంగాణ అసలైన అభివృద్ధి, అవినీతి రహిత పాలన, ప్రజల సంక్షేమం కేవలం ‘మోదీ గ్యారంటీ’తోనే సాధ్యమని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో రాజకీయ మార్పు తప్పనిసరిగా వస్తుందని, ప్రజలు త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. సభలో బీజేపీ శ్రేణులు భారీగా పాల్గొని కిషన్‌రెడ్డి ప్రసంగానికి మద్దతు తెలిపారు.

# తెలంగాణ అభివృద్ధికి సహకరించండి

- **తెలంగాణ కీలక ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి**
- **మోడీకి టీపీసీసీ చీఫ్ లేఖ.. మెట్రో, మూసీ ప్రాజెక్టులకు నిధుల విజ్ఞప్తి**
- **తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రధాని మోడీకి లేఖ**
- **రాష్ట్ర ప్రగతికి కీలక ప్రాజెక్టులపై కేంద్ర చొరవ కోరిన కాంగ్రెస్ నేత**
- **హైదరాబాద్ మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర సహకారం అవసరం**

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

తెలంగాణ రాష్ట్ర ప్రగతికి ఊతమిచ్చే కీలక ప్రాజెక్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతూ టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో విస్తరణతో పాటు మూసీ పునరుద్ధరణ వంటి ప్రాజెక్టులకు ఆర్థిక సాయం, అనుమతులు మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నగరం నలుమూలలా మెట్రో సేవలను విస్తరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలకు కేంద్రం మద్దతు ఇవ్వాలని మహేష్ గౌడ్ కోరారు. ముఖ్యంగా మెట్రో రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులు మంజూరు చేయడంతో పాటు, తగినన్ని నిధులు విడుదల చేయాలని లేఖలో పేర్కొన్నారు.

మూసీ పునరుద్ధరణ.. ఆర్‌ఆర్‌ఆర్‌కు సాయం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుద్ధరణ (Musi Rejuvenation) ప్రాజెక్టుకు కేంద్రం ఆర్థికంగా తోడ్పాటు అందించాలని కోరారు. అలాగే, రీజినల్ రింగ్ రోడ్ (RRR) పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని, గ్రీన్ ఫీల్డ్ హైవేల విస్తరణకు సహకరించాలని విన్నవించారు. హైదరాబాద్ శివారు ప్రాంతాలను కలిపే రేడియల్ రోడ్ల అభివృద్ధికి కేంద్రం ఆర్థిక సాయం అందించాలి. గ్రీన్ ఫీల్డ్ హైవేల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి, పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలి. రాష్ట్ర అభివృద్ధిలో రాజకీయాలకు తావులేకుండా, కేంద్రం తన వంతు బాధ్యతగా నిధుల విడుదల చేయాలని కోరారు. తెలంగాణలోని మౌలిక సదుపాయాల కల్పనలో కేంద్రం క్రియాశీలకంగా వ్యవహరించాలని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి వెళ్లే ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించాలని మహేష్ గౌడ్ ఈ లేఖ ద్వారా ప్రధానిని కోరారు.

# రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నా రేవంత్ రెడ్డికి కనికరం లేదు

మొదటిపేజీ తరువాయి

కన్నీళ్లు పెట్టుకుంటున్నా రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి.. మీకు ఢిల్లీకి పోవడం, హైదరాబాద్‌కు రావడం తప్ప వేరే పనే లేదా? ఢిల్లీకి వెళ్లి కప్పం కట్టడం తప్ప.. రాష్ట్రంలో 70 లక్షల మంది రైతుల కష్టాలు ముఖ్యమంత్రికి, మంత్రులకు పట్టవా? అని ప్రశ్నించారు. ఇంతవరకు వడ్ల కొనుగోళ్లపై ఒక్క రోజైనా కలెక్టర్ల కాన్ఫరెన్స్ పెట్టారా? మీ మంత్రులతో ఒక్క మీటింగ్ అయినా చేశారా అని నిలదీశారు. ఇవాళ మెదక్ జిల్లా చేగుంట మండలం కర్నాల్పల్లి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన హరీశ్ రావు ఈ సందర్భంగ మాట్లాడారు.

**ఏసీ రూముల్లో కూర్చుని అబద్ధాలు**

ఈ ప్రభుత్వానికి రైతులంటే లెక్క లేదని వారి పట్ల చిన్నచూపు ఉన్నందు వల్లే ఈ దుస్థితి దాపురించిందన్నారు. ఏసీ రూముల్లో కూర్చుని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని ఆయన ఒకసారి పోలీసులను పక్కనపెట్టి రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలు తిరిగితే రైతుల కన్నీళ్లు, కష్టాలు ఏంటో అర్థమవుతాయన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆ పార్టీ సర్పంచులే ఇవాళ వడ్లు కొనాలని కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేస్తున్నారంటే మీ ప్రభుత్వ పరిస్థితి ఎంత దయనీయంగా, దారుణంగా తయారైందో ఒకసారి అర్థం చేసుకోవాలన్నారు. ప్రతిపక్ష నాయకులు సోషల్ మీడియాలో ట్వీట్లు చేస్తే కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్న ముఖ్యమంత్రికి.. రైతుల బాధల గురించి ఇంటెలిజెన్స్, పోలీసులు నివేదికలు ఇవ్వడం లేదా? అని నిలదీశారు. ప్రభుత్వం తక్షణమే మేల్కొని లారీలు పంపించి, కాంటాలు పెట్టి వడ్లు కొనాలని లేదంటే రైతుల పక్షాన బీఆర్‌ఎస్ (BRS Party) ఎమ్మెల్యేలు, నాయకులం అంతా కలెక్టరేట్లను ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌లో అవినీతి**

మక్కలు, శనగలు, సన్ ఫ్లవర్ అమ్మిన రైతులకు ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా వేయలేదన్నారు. జొన్నల కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభమే కాలేదన్నారు. 35 రోజుల నుంచి సన్ ఫ్లవర్ కొనుగోళ్లు ఆగిపోయాయి. కుప్పల కింద ఆ పంటకు చెదలు పడుతున్నా ప్రభుత్వానికి కనికరం లేదని మండిపడ్డారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌లో జరిగిన అవినీతి వల్లే నేడు అది దివాలా తీసిందని ఆ సంస్థ NPA కావడంతో బ్యాంకులు అప్పులివ్వడం లేదన్నారు. దాంతో దొడ్డిదారిన కోఆపరేటివ్ బ్యాంకు నుంచి మార్క్ ఫెడ్ కు, అక్కడి నుంచి సివిల్ సప్లైస్ కు డబ్బులు మళ్లించారు. మీ అవినీతి, తప్పులకు రైతులను బలిచేస్తున్నారు.



# తమిళనాడు సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకారం

మొదటిపేజీ తరువాయి

రావడం ఇదే తొలిసారి కావడంతో యావత్ తమిళనాడు ఇప్పుడు పండుగ వాతావరణంలో మునిగిపోయింది. స్టేడియం లోపల, బయట లక్షలాదిగా తరలివచ్చిన అభిమానులు 'దళపతి.. సీఎం దళపతి' అంటూ చేసిన నినాదాలు మిన్నంటాయి. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ముఖ్యమంత్రి హోదాలో విజయ్ తన పాలనా ముద్రను చాటుతూ మూడు అత్యంత కీలకమైన ఫైళ్లపై సంతకాలు చేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నారు.

విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చేసిన తొలి సంతకం రాష్ట్రంలోని సామాన్యులకు పెద్ద ఊరటనిచ్చింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తూ ఆయన ఫైలుపై సంతకం చేశారు. దీనివల్ల రాష్ట్రంలోని కోట్లాది మధ్యతరగతి, పేద కుటుంబాలకు విద్యుత్ భారరం తగ్గనుంది. ఇక రెండో సంతకంగా మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ షీ టీమ్స్ తరహాలో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక నిఘా విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో పెరిగిపోతున్న మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు 'ఈగిల్' వ్యవస్థ తరహాలో స్పెషల్ ఫోర్స్‌ను రంగంలోకి దించుతూ మూడో సంతకాన్ని పూర్తి చేశారు. ఈ మూడు నిర్ణయాలు విజయ్ పాలనలో ప్రజల అవసరాలకు, భద్రతకు ఎంతటి ప్రాధాన్యత ఉంటుందో స్పష్టం చేస్తున్నాయి.

ప్రమాణ స్వీకార వేదికపై ఆసక్తికర సన్నివేశాలు కూడా చోటుచేసుకున్నాయి. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం విజయ్, వేదికపై ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో కలిసి సెల్ఫీ దిగారు. అంతేకాకుండా స్టేడియంలో ఉన్న వేలాది మంది అభిమానులను కవర్ చేస్తూ తన మొబైల్ ఫోన్‌లో సెల్ఫీ వీడియోను రికార్డు చేయడం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. తనను సినీ రంగంలో అగ్రస్థానంలో నిలబెట్టిన అభిమానులే ఇప్పుడు సీఎంగా గెలిపించారన్న కృతజ్ఞతా భావంతో ఆయన అందరికీ అభివాదం చేస్తూ మురిసిపోయారు. విజయ్‌తో పాటు ఆయన కేబినెట్‌లో తొమ్మిది మంది మంత్రులు ప్రమాణం చేశారు. సెంగోట్టియన్, అధవ అర్జున్, ఎన్ ఆనంద్, డా. కేజీ అరుణ్ రాజ్, నిర్మల్ కుమార్, రాజ్‌మోహన్, పి. వెంకటరమణన్, డా. టీకే ప్రభు మరియు ఎస్. కీర్తనలు విజయ్ జట్టులో మంత్రులుగా బాధ్యతలు తీసుకున్నారు.

ముఖ్యమంత్రిగా తన తొలి ప్రసంగంలో విజయ్ ఎంతో భావోద్వేగానికి లోనయ్యారు. తాను ఒక సాధారణ డైరెక్టర్ కుమారుడిగా మొదలై, జీవితంలో ఎన్నో ఆకలి బాధలు, అవమానాలు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చానని గుర్తు చేసుకున్నారు. మైనార్టీలకు, పేదలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. "మీరు నన్ను 25 ఏళ్లుగా మీ తమ్ముడిగా, అన్నగా గుండెల్లో పెట్టుకున్నారు. మీ కోసమే రాజకీయాల్లోకి వచ్చాను. కుట్రలు, కుతంత్రాలను దాటుకుని నన్ను నమ్మినందుకు మీకు ఎప్పుడూ రుణపడి ఉంటాను" అని వ్యాఖ్యానించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం 'విజయ్ మామ' అన్నీ మంచి పనులే చేస్తాడంటూ పిల్లలను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు ఆకట్టుకున్నాయి. అలాగే డీఎంకే ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసిందని, రాష్ట్రం ప్రస్తుతం 10 లక్షల కోట్ల అప్పులో ఉందని ఆరోపిస్తూ, త్వరలోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై 'శ్వేతపత్రం' విడుదల చేస్తామని స్పష్టం చేశారు.

# భయపడటానికి ఫామ్‌హౌస్‌లో ఎలుకను కాదు..

మొదటిపేజీ తరువాయి



కడుపు నిండుతుందా? అని కాంగ్రెస్ నేతలు హేళనగా మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. అదే నినాదంతో బెంగాల్‌లో బీజేపీ (BJP) ప్రభుత్వం ఏర్పడిందనే విషయాన్ని కాంగ్రెస్ నేతలు మర్చిపోవద్దు. తెలంగాణలోనూ వచ్చే ఎన్నికల్లో పక్కాగా అధికారంలోకి వస్తాం. సనాతన ధర్మం కోసం మేము నిరంతరం పనిచేస్తాం.. మా ధర్మాన్ని కించపరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు’ అని బండి సంజయ్ స్పష్టం చేశారు.

గ్యారంటీలపై నిలదీత..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు (Six Guarantees) ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ముఖ్యంగా రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ధాన్యం కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఈ క్రమంలోనే రాష్ట్ర బీజేపీ నేతలకు కీలక సూచన చేశారు. నాయకులు తమ మధ్య ఉన్న అభిప్రాయభేదాలను పక్కన పెట్టి పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రాజకీయ ప్రత్యర్థులపై విరుచుకుపడుతూ.. ‘బీజేపీ కార్యకర్తను అయినందుకు నేను ఎంతగానో గర్వపడుతున్నాను. పార్టీ తలవంచుకునే పని నేను ఎప్పుడూ చేయలేదు. నన్ను రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. బెదిరింపులకు భయపడటానికి నేనేమీ ఫామ్‌హౌస్‌లో దాక్కునే ఎలుకను కాదు’ అని బండి సంజయ్ ఫైర్ అయ్యారు.

# నీటి సంపులో పడి మూడేళ్ల చిన్నారి మృతి



**శంకర్ పల్లి మే 10(ప్రజాక్షేత్రం):**

జన్వాడ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మూడేళ్ల చిన్నారి ప్రియాన్షు ఆడుకుంటూ ఇంటి సమీపంలో ఉన్న నీటి సంపు వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు సంపులో పడిపోవడంతో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు చిన్నారి కనిపించకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికారు. అనంతరం నీటి సంపులో చిన్నారి మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందుకున్న స్థానికులు, గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబాన్ని ఓదార్చారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చిన్న పిల్లలు ఆడుకునే ప్రాంతాల వద్ద భద్రతా చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా నీటి సంపులు, బావులు, ట్యాంకులకు రక్షణ కవర్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు సూచిస్తున్నారు.



# పోతుగల్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- **పోతుగల్ గ్రామ సర్పంచ్ పామేనా నరసింహులు వెల్లడి.**
- **గ్రామ పురవీధుల్లో 3లక్షల నిధులతో గ్రామంలోమట్టి పోసి పాత కొత్త రోడ్లకు పునరుద్ధరణ.**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 10(ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని పోతుగల్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు ప్రస్తుతం మూడు లక్షల నిధులతో గ్రామంలోని గ్రామంలోని అన్నిపురవీధుల్లో ట్రాక్టర్లతో మట్టి పోసి డోజర్ల సహాయంతో రోడ్ల పునరుద్ధరణ కార్యక్రమం ముమ్మరంగా చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ పామేనా నర్సింలు వెల్లడించారు. ఆదివారం పోతుగల్ గ్రామంలో మట్టి పోసి రోడ్లు పునర్నిర్మాణ కార్యక్రమం పూర్తిచేసే కార్యక్రమం పూర్తయింది అన్నారు. అనంతరం గ్రామంలో డ్రైనేజీ పనులు కూడా అతి త్వరలోనే చేపడుతున్నట్లు ఆయన ప్రజాక్షేత్రం విలేకరి వివరించారు. ముఖ్యంగా తాము పోతుగల్ గ్రామ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు గ్రామ ప్రజల నమ్మకాలను వమ్ము చేయకుండా దశలవారీగా పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం పోతుగల్ గ్రామంలోని అన్ని పురవీధుల్లో మట్టి పోసి రోడ్ల పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టిన తర్వాత వెంటనే గ్రామంలో డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు ఇప్పటికే పోతుగల్ గ్రామంలో వేసవి తాపానికి మంచినీటి కొరత లేకుండా ప్రతిరోజు గ్రామపంచాయతీ సిబ్బంది తగిన చర్యలు తీసుకుంటున్నారని దీంతో పోతుగల్ గ్రామంలో మంచినీటి కొరత లేకుండా ముమ్మరమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రస్తుతం పోతుగల్ గ్రామంలో పనులు పూర్తయిన తర్వాత రెండు తండాల్లో రోడ్లు, డ్రైనేజీ పనులు కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నీరెట్ల సావిత్రి మరియు గ్రామ పాలకవర్గం గ్రామ ప్రజలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సాన్వి రెడ్డి పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేసిన 30 మంది యువకులు

- **ఒక్కరి రక్తదానం ముగ్గురి ప్రాణం మధుసూదన్ రెడ్డి**

**శంకర్‌పల్లి మే 10(ప్రజాక్షేత్రం):**

ఒక వ్యక్తి ఇచ్చే రక్తం మూడు జీవితాలను కాపాడగలదని రక్తదాన శిబిర ఆర్గనైజర్ ఎల్ మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం మధుసూదన్ రెడ్డి కూతురు సాన్వి రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రేవతి హైస్కూల్ లో ప్రీమియర్ బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 30 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛందంగా యువకులు పాల్గొని రక్తదానం చేస్తున్నారని కొనియాడారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో సేవా భావాన్ని పెంపొందించడమే కాకుండా అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడుతుందని వెల్లడించారు.




# నాడు పెళ్లిలో దారుణమైన అవమానం

- **అప్పుడే దళపతికి రాజకీయ బీజం**
- **నేడు ముఖ్యమంత్రి అయ్యాడు**





సినిమాల్లో తిరుగులేని స్టార్‌గా, దళపతిగా రాణిస్తోన్న విజయ్.. రాజకీయాలవైపు ఎందుకు టర్న్ తీసుకోవాల్సి వచ్చింది? ఆయనకు జరిగిన అవమానమేంటి? దళపతి రాజకీయ ఎంట్రీ వెనకున్న కారణాలివేనా? అంటే అవునన్నా చెప్పవచ్చు. పెళ్లిలో విజయ్ కి దారుణం అనే అవమానం.. స్టాలిన్ కొంపముంచింది ఇదే... అదే పట్టుతో రాజకీయాలకు అడుగుపెట్టి డీవీకే పార్టీ స్థాపించి అంచలంచలుగా తమిళనాడుకి ముఖ్యమంత్రి అయ్యాడు విజయ్.

దళపతి విజయ్.. తమిళనాట సంచలనం సృష్టించారు. తమిళనాడు2026 ఎన్నికల ఫలితాల్లో తన టీవీకే పార్టీ ప్రభంజనం సృష్టించింది. ఆయన ఏకంగా 108సీట్లు గెలుపొందారు. మ్యాజిక్ ఫిగర్‌కి ఇంకా పది సీట్లు తక్కువగా వచ్చినా, విజయ్ పార్టీ నెంబర్ 1 స్థానంలో ఉంది. మిత్రపక్షలతో కలిసి అధికారం దక్కించుకున్నారు. ముఖ్యంగా ఆయన ఈ స్థాయిలో సీట్లు గెలవడం అందరిని ఆశ్చర్యపరుస్తోంది. దేశ రాజకీయాలను షేక్ చేస్తోంది. దేశంలో మూడు రాష్ట్రాల్లో బీజేపీ గెలిచినా, దానిపై చర్చ లేదు. అంతా విజయ్ చుట్టూనే రాజకీయం నడిచింది. ఆయన ఇప్పుడు ఇండియా వైడ్‌గా హాట్ టాపిక్‌గా మారారు.

మరి విజయ్ రాజకీయాలకు రావాలని ఎందుకు అనిపించింది? ఆయనకు రాజకీయ ఆలోచనకు బీజం పడ్డ సందర్భమేంటి? అనేది చూస్తే, చాలా చిన్న కారణం ఉంది. అయితే విజయ్‌కి మాత్రం అది చాలా ప్రస్టీజియస్ ఇష్యూ. ఆయనకు ఒక పెళ్లిలో జరిగిన అవమానమే కారణమని టాక్. కొన్నాళ్ల క్రితం ఒక ప్రముఖ నిర్మాత కొడుకు వివాహం జరిగింది. ఆ పెళ్లికి దళపతి విజయ్‌తోపాటు చాలా మంది సెలబ్రిటీలు హాజరయ్యారు. సీఎంగా ఉన్న స్టాలిన్ కూడా వచ్చారు. ఈవెంట్ హాల్‌లో ముందుగా విజయ్ వెళ్తున్నారట. ఆ తర్వాత సీఎం వచ్చారు. సీఎం సెక్యూరిటీ.. విజయ్ ఒక సూపర్ స్టార్ అని కూడా చూడకుండా ఆయన్ని సైడ్ చేశారట. కామన్‌గా సీఎం వస్తున్నారంటే సెక్యూరిటీ సీఎంకి రౌండ్‌గా ఉంటారు, ఎవరినీ రానివ్వరు, ఆ పరిధిలో ఉండనివ్వరు.

అలానే సీఎం స్టాలిన్ వస్తుంటే.. విజయ్ ని సెక్యూరిటీ సిబ్బంది పక్కకు మూవ్ చేశారు. ఒక కామన్ మ్యాన్ లాగానే ట్రీట్ చేశారు. ఈ సందర్భంగా విజయ్‌ని.. స్టాలిన్ కూడా చూశారట. కానీ ఎలాంటి రియాక్షన్ లేదు. జస్ట్ స్మైల్ ఇచ్చి వెళ్లిపోయారట. ఒక పెద్ద స్టార్ ఎదురుపడితే, సీఎం అయినా, పీఎం అయినా విష్ చేసి, షేక్ హ్యాండ్ ఇచ్చి, వెళ్తుంటారు. బేసిక్ రెస్పెక్ట్ ఇస్తుంటారు. కానీ ఇక్కడ విజయ్‌కి అది మిస్ అయ్యింది. దాన్ని విజయ్ అవమానంగా ఫీలయ్యారట. తానేంటో చూపించాలనే ఆలోచన అప్పుడే వచ్చిందట. ఓ రకంగా తాను రాజకీయాల్లోకి రావాలనే ఆలోచనకు బీజం పడింది అక్కడే అని తమిళనాడు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అలానే చిన్నప్పట్నుంచి ఆయన చాలా అవమానాలు ఫేస్ చేశారట. కులానికి సంబంధించి, మతానికి సంబంధించిన అవమానాలు కూడా ఫేస్ చేశారట. ఇవన్నీ ఆయనలో గుడుకట్టుకున్నాయని అంటుంటారు.

దీనికితోడు విజయ్ సినిమాల విడుదలకు అడ్డంకులు. విజయ్ హీరోగా వచ్చిన చాలా సినిమాలు విడుదల విషయంలో ప్రభుత్వాలు అడ్డుంకులు సృష్టించాయి. పొలిటికల్ డైలాగ్‌లు, రాజకీయ విమర్శలు ఉండటం, సినిమాల్లో ప్రభుత్వాన్ని నిలదీసే, వారి తప్పులను ఎత్తిచూపే సీన్లు ఉండటంతో విడుదలకు అడ్డంకులు సృష్టించారు. మొన్న జననాయకుడు విషయంలోనే కాదు సర్కార్, మెర్సల్, తలైవా ఇలా చాలా సినిమాల విషయంలో ఇదే జరిగింది. దీంతో విజయ్‌కి అక్కడే మండిందట. రాజకీయ లెక్కలేంటో తేల్చుకోవాలనుకున్నారట. దీనికితో ఇటీవల 'జననాయకుడు సినిమాని విడుదలను ఆపేశారు. పొలిటికల్ డైలాగ్‌లు ఉండటంతోనే దీన్ని అడ్డుకున్నారు. ఈ మూవీ ఇప్పటికీ రిలీజ్ కాలేదు. ఇది కూడా సీఎం స్టాలిన్ కొంపముంచిందట. సినిమా విషయంలో ఇన్ని రకాల ఇబ్బందులు పెట్టడం స్టాలిన్‌కి మైనస్‌గా మారింది. విజయ్‌కి



ప్లస్ అయ్యింది. అది ఏకంగా సీఎం పీఠం దక్కేలా చేసింది. స్టాలిన్‌కి సీఎం పీఠం ఊడేలా చేసింది.

మరోవైపు తమిళనాడులో ఇటీవల ఏ హీరో సినిమాలు చేసినా సన్ పిక్చర్స్ తోనో, లేదంటే ఉదయనిధి స్టాలిన్ పెట్టిన రెడ్ జాయింట్ ప్రొడక్షన్స్ తోనూ టై అప్ కావాల్సి ఉంటుందట. విడుదల విషయంలో అయినా, రిలీజ్ రైట్స్, ప్రొడక్షన్‌లో భాగం కావడం, ఓటీటీ వంటి విషయాల్లో వారితో కలవాలనే నిబంధన ఉందట. విజయ్ హీరోగా వచ్చిన చిత్రాల విషయంలోనూ ఇదే నిబంధన వర్తించిందట. దీంతో ఇది కూడా విజయ్‌కి మండటానికి కారణమైందని, రాజకీయంగా తాడో పేడో తేల్చుకోవాలనే ఆలోచన వచ్చిందని సమాచారం. ఇలా తనకు జరిగిన అవమానం కారణంగా విజయ్ రాజకీయాల్లోకి రావాలనే ఆలోచనకు వచ్చారని, ఎవరూ ఊహించని విధంగా ఇప్పుడు ఏకంగా సీఎం పదవిని చేపట్టారు అంటున్నారు. ఏదేమైనా, కారణాలేమైనా.. విజయ్ తమళ రాజకీయాల్లోనే కాదు, దేశ రాజకీయాల్లోనూ పెను సంచలనంగా చెప్పొచ్చు. సరికొత్త చరిత్ర కి శ్రీకారం చుట్టారని చెప్పొచ్చు.



**ఎం రవీందర్**
**సీనియర్ జర్నలిస్ట్**
**790103777**

# కరీంనగర్‌లో రెచ్చిపోతున్న రేషన్ మాఫియా...

- **పేదల బియ్యం బ్లాక్ మార్కెట్ బాట!**
- **రాత్రివేళ యథేచ్ఛగా అక్రమ రవాణా**
- **ద్విచక్ర వాహనాలపై ప్రభుత్వ బియ్యం తరలింపు**
- **వైరల్ వీడియోతో బయటపడిన దందా**

**కరీంనగర్, మే 10(ప్రజాక్షేత్రం):**

పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం కరీంనగర్ నగరంలో పక్కదారి పడుతున్న ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఇన్నాళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న రేషన్ బియ్యం దందా ఇప్పుడు బహిరంగంగానే కొనసాగుతుండటం చర్చనీయాంశమైంది. తాజాగా రాత్రివేళ ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై ప్రభుత్వ ముద్ర ఉన్న సంచుల్లో బియ్యాన్ని తరలిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అక్రమ రవాణా వ్యవహారం మరోసారి వెలుగులోకి వచ్చింది. వైరల్ వీడియోలో ప్రభుత్వ పంపిణీ బియ్యాన్ని ఎలాంటి భయం లేకుండా తరలిస్తున్న దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇదే తరహా రవాణా తరచూ జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు రేషన్ డీలర్లు, మధ్యవర్తులు, వ్యాపారుల కుమ్మక్కుతో ఈ దందా సాగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా, గతంలో భగత్‌నగర్ 42వ డివిజన్‌లో కూడా ఇలాంటి ఘటన వెలుగులోకి వచ్చిన విషయం స్థానికులు గుర్తుచేస్తున్నారు. అప్పట్లో కూడా రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఆరోపణలు వెల్లువెత్తినా, కఠిన చర్యలు తీసుకోకపోవడంతో మళ్లీ అదే పరిస్థితులు పునరావృతమవుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ దందాపై అధికారుల నిఘా పూర్తిగా సడలిపోయిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం పేదల కోసం ఉచితంగా అందిస్తున్న బియ్యం చివరకు బ్లాక్ మార్కెట్‌కు చేరుతుండటంపై ప్రజలు మండిపడుతున్నారు. సంబంధిత శాఖల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపమే ఈ అక్రమాలకు ప్రధాన కారణమని విమర్శిస్తున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ఎలాంటి తనిఖీలు లేకపోవడంతో అక్రమ రవాణాదారులు మరింత రెచ్చిపోతున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సివిల్ సప్లైస్ అధికారులు, టాస్క్ ఫోర్స్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పేదల బియ్యాన్ని దోచుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని రేషన్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంచాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



# ఆపదలో అండగా...మానవత్వం చాటిన కోళ్ల యాదయ్య

- **మాచన్‌పల్లి గ్రామంలో మృతుడి కుటుంబానికి వెంటనే రూ.5 వేల సహాయం అందించి పెద్దమనసు చాటుకున్న నాయకుడు**

**షాబాద్ మే 10(ప్రజాక్షేత్రం):**



షాబాద్ మండలం మాచన్‌పల్లి గ్రామానికి చెందిన కలాల్ నర్సింలు గౌడ్ అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబం దుఃఖంలో మునిగిపోయిన విషయం తెలుసుకున్న కోళ్ల యాదయ్య వెంటనే వారి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కష్టకాలంలో ధైర్యం చెప్పి, మానవత్వాన్ని చాటుతూ అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామ ప్రజల కష్టసుఖాల్లో ఎప్పుడూ ముందుండే కోళ్ల యాదయ్య మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారని గ్రామస్తులు అభినందించారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడం ఆయన గొప్ప మనసుకు నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలాల్ ప్రవీణ్ గౌడ్, వార్డు సభ్యుడు రమేష్, కోళ్ల సత్తయ్య, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువులో మునిగి ఇంటర్ విద్యార్థి మృతి

**కీసర, మే 10(ప్రజా క్షేత్రం):**

మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కీసర పోలీస్‌స్టేషన్ పరిధి యాద్గార్‌పల్లిలో విషాదం చోటుచేసుకుంది. మల్కాజిగిరి మల్లికార్జుననగర్‌కు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి మదాని గౌరవ్ దత్తా(17) చెరువులో మునిగి మృతి చెందాడు. స్నేహితులతో కలిసి 'అండర్ ది మూన్'కు వెళ్లిన అనంతరం సమీప చెరువులో ఈతకు దిగగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి తల్లి మదాని రేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కీసర పోలీసులు తెలిపారు.



ప్రజాక్షేత్రం
తెలుగు దినపత్రిక
11.05.2026
సోమవారం | హైదరాబాద్

# అమీన్‌పూర్ చెరువు: మన వారసత్వం కాపాడుకోవడం మన బాధ్యత

- **భారతదేశపు మొట్టమొదటి "జీవవైవిధ్య వారసత్వ సంపద" (బయోడైవర్సిటీ హెరిటేజ్ సైట్ )**
- **జీవవైవిధ్యంలో విశిష్టతగల అమీన్‌పూర్ చెరువు – ఇప్పుడు ఆక్రమణలకు, కాలుష్యానికి నెలవు.**
- **ఆమీన్ పూర్ చెరువు జీవవైవిధ్యం ఇప్పుడు ఆక్రమణల మరియు కాలుష్య కాసార నిలయం.**







అమీన్ పూర్ లేక్ బయోడైవర్సిటీ హెరిటేజ్ సైట్: అమీన్ పూర్ లేక్ ఒకప్పుడు హైదరాబాద్ పరిసరాల్లో అత్యంత ప్రాముఖ్యమైన జీవవైవిధ్య కేంద్రంగా నిలిచింది. ఇది దేశంలోనే మొదటి బయోడైవర్సిటీ హెరిటేజ్ సైట్‌గా గుర్తింపు పొందిన అరుదైన చెరువు. వలస పక్షులు, స్థానిక పక్షులు, చేపలు, ఉభయచరాలు, నీటి మొక్కలు——ఇవి అన్నీ కలిసి ఒక సమతుల్య మైన ప్రకృతి వ్యవస్థను ఇక్కడ నిర్మించాయి. పక్షి ప్రేమికులు, ప్రకృతి పరిశోధకులకు ఇది ఒక జీవంత ప్రయోగశాలగా ఉండేది. హైదరాబాద్, సికింద్రాబాద్ మరియు చుట్టుపక్కల ప్రాంతాలను కలుపుకొని దాదాపు 1400 కు పైగా నీటి నిలయాలైన జలాశయాలు, కుంటలు, గొలుసు కట్టు చెరువులు, వాగులు, వంకలు, ఆనకట్టలు, రిజర్వాయర్లు, కుంట కట్టలు నిండిన ప్రకృతి సహజ సంపదతో వాటి జీవ వైవిధ్యం వెల్లివిరుస్తూ ఉండేది. అయితే ప్రస్తుతం ఈ చెరువు పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. ఆక్రమణలు చెరువు సహజ సరిహద్దులను క్రమంగా తగ్గిస్తున్నాయి. రియల్ ఎస్టేట్ ఒత్తిడి వల్ల చెరువు చుట్టూ అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నాయి. దీనితో సహజ నీటి ప్రవాహ మార్గాలు దెబ్బతింటున్నాయి. 400 సంవత్సరాల చరిత్ర కలిగిన నీటి నిలయాలు జలాశయాలు కుంటలు చెరువులు అన్నీ స్వార్థపరుల చేతుల్లో, "అభివృద్ధి ముసుగు బూచి లో" ఆక్రమించబడుతున్నాయి.

అమీన్ పూర్ చెరువు కాలుష్యం తీరు తెన్నులు: కాలుష్యం మరో పెద్ద సమస్యగా మారింది. సమీప ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరు, పారిశ్రామిక వ్యర్థాలు చెరువులో కలుస్తుండటం వల్ల నీటి నాణ్యత పడిపోతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు, పూజా సామగ్రి, గృహ వ్యర్థాలు చెరువులో చేరి జీవజాలంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీనివల్ల చేపల మరణాలు, పక్షుల సంఖ్య తగ్గుదల వంటి పరిణామాలు కనిపిస్తున్నాయి. రోజురోజుకు చెరువులోని నీటి భౌతిక, రసాయనిక ధర్మాలను కోల్పోతూ, భౌగోళిక స్వరూపాలను చెరిపివేయబడుతున్నాయి. కబ్జాకోరులు, ఆక్రమణదారులు, లంచగొండి అధికారుల అండదండలతో, స్వార్థ రాజకీయ నాయకుల కనుసన్నల్లో చట్టాలను తుంగలో తొక్కి ఆక్రమించబడుతున్నాయి.

ఇలాంటి ప్రకృతి వ్యతిరేకమైనటువంటి పరిణామాన్ని అడ్డుకోలేకపోతే మనకు ఇలాంటి జీవ వైవిధ్యం గల చెరువులు ఉండవు, వాటి యొక్క ఆహ్లాదకరమైనటువంటి వాతావరణము, జీవవైవిధ్యము మనకు కనుమరుగవుతుంది.

అమీన్ పూర్ చెరువు ఆవాస బౌగోళిక వివరాలు: ఇప్పుడు ఈ సహజ సిద్ధమైన ప్రకృతి వనరులలో ఒకటైనటువంటి నీటి ఆవాసాలు, చెరువులు దక్షిణించుకోకపోతే భవిష్యత్తులో ఇక ఏమీ ఉండవు. తద్వారా ఈ చెరువులో ఉన్నటువంటి జంతు, వృక్ష ప్లవకాలు జంతువృక్ష పక్షి జీవజాతులు ఏమీ మిగలవు. తద్వారా ఇది నీటి ఆవాసం అసమతుల్యతకు గురి అయ్యి అనేక జీవజాతులు విలుప్తమైపోయే ప్రమాదం ఉంది. రోజురోజుకు మాయమవుతున్న చెరువులు కుంటలలో అమీన్‌పూర్ చెరువు (అమీనాపూర్ చెరువు) కూడా ఒకటి. అమీన్‌పూర్ భారతదేశంలోని తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లాలో మరియు హైదరాబాద్ నగరం అంచున, బీరంగూడ ఆవరణంలో ఉన్న ఒక చిన్న సరస్సు. భారతదేశంలో బయోడైవర్సిటీ హెరిటేజ్ సైట్‌గా గుర్తించబడిన మొదటి నీటి వనరు ఇది మరియు పట్టణ ప్రాంతంలో ఆమోదించబడిన మొదటి జీవవైవిధ్య ప్రదేశం. అమీన్‌పూర్ లేక్ (అమీనాపూర్ చెరువు) పూర్తి వైశాల్యం 93 ఎకరాలు. హైదరాబాద్ జంట నగరాల నువ్వు తెలిసిన అందరికీ ఇది ఈ చెరువు సుపరిచితమే. రాష్ట్రంలో కుంటలు, చెరువులు, రిజర్వాయర్లు, వాగులు, వంకలు, నీటి నిల్వలు, నీటి వనరులు ఆక్రమించబడి మాయమైపోతున్నాయి. ఒకప్పుడు మంచినీటి నిలయాలైన ఇవి ఇప్పుడు మురికి కూపాలుగా మారిపోతున్నాయి.

అమీన్ పూర్ చెరువు ఆవాసం యొక్క వైశాల్యం: అమీన్ పూర్ లేక్ గురించి ఖచ్చితమైన అధికారిక గణాంకాలు అన్ని పారామీటర్లకు (లోతు, నీటి కెపాసిటీ) పబ్లిక్‌గా పూర్తిగా అందుబాటులో ఉండకపోయినా, సాధారణంగా అందుబాటులో ఉన్న అంచనాలు ఇలా ఉన్నాయి: వైశాల్యం (ఏరియా): దాదాపు 93 ఎకరాలు (సుమారు 37-38 హెక్టార్లు). వెడల్పు / విస్తీర్ణ ఆకృతి: చెరువు ఒకే విధంగా సరిగ్గా కొలిచే ఆకారంలో ఉండదు. కానీ సగటున కొన్ని చోట్ల సుమారు 300 మీటర్లు - 600 మీటర్ల వరకు వెడల్పు ఉంటుంది. లోతు (డెప్త్): సీజన్‌పై ఆధారపడి మారుతుంది. సాధారణంగా 2 మీటర్లు - 6 మీటర్ల వరకు ఉంటుంది (మంచి వర్షాకాలంలో ఎక్కువగా ఉంటుంది). నీటి నిల్వ సామర్థ్యం (వాటర్ కెపాసిటీ): ఖచ్చిత సంఖ్య అధికారికంగా ప్రకటించబడలేదు. అయితే పై పరిమాణాల ప్రకారం అంచనా వేస్తే: సుమారు 0.5 - 1.0 మిలియన్ క్యూబిక్ మీటర్ల మధ్య ఉండే అవకాశం ఉంది. ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సింది ఏమిటంటే ఆక్రమణలు, మురుగునీటి ప్రవాహం, మట్టి పేరుకుపోవడం (సిల్టేషన్) వల్ల ఈ పరిమాణాలు కాలక్రమంలో తగ్గుతున్నాయి. నిజమైన కెపాసిటీ కంటే ప్రస్తుతం చెరువు నిల్వ సామర్థ్యం చాలా తక్కువగా ఉండే అవకాశం ఉంది.

అమీన్ పూర్ చెరువు జీవవైవిధ్య విశిష్టత: భారతదేశపు మొట్టమొదటి "జీవవైవిధ్య వారసత్వ సంపద" (బయోడైవర్సిటీ హెరిటేజ్ సైట్ ). విశిష్టమైన జీవవైవిధ్యానికి ఆలవాలమైన జలావరణం అమీన్‌పూర్ చెరువు. అమీన్‌పూర్ లేక్ ఒక విశిష్ట జీవవైవిధ్యముగలది. 272 కు పైగా పక్షి జాతులు వలస వచ్చి వెళుతుంటాయి. వివిధ జాతులకు ఆశ్రయం తో పాటు ఆతిథ్యం ఇచ్చే అంతర్జాతీయ జలావరణ వ్యవస్థ. ప్రతి సంవత్సరం వివిధ దేశాల నుండి ప్రతికూల వాతావరణాన్ని తప్పుకునేందుకు ఇక్కడికి పక్షులు వలస వచ్చి ఈ చెరువులో సేదతీరి తమ జీవన చక్రాన్ని సగం వరకు ఇక్కడే గడుపుకొని మళ్ళీ అనుకూల పరిస్థితులలో తిరిగి వాటి దేశాలకు తిరిగి వెళ్తాయి.

ఈ ప్రత్యేకమైనటువంటి, ప్రకృతి సిద్ధమైనటువంటి వాతావరణాన్ని, సహజ వనరుని, విశిష్టమైనటువంటి జీవవైవిధ్యాన్ని ఆహ్లాదంగా తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల వాళ్ళు, చుట్టుపక్కల నివసించే కొంతమంది ప్రకృతి ప్రేమికులు, ప్రకృతి ఫోటోగ్రాఫర్స్, అటవీ ఛాయా చిత్రకారులు (వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్స్), మొదలగు వారు ఇక్కడికి వచ్చి అది మన తప్పు అవుతుంది తిరిగి సంతోషంగా గడిపేవారు. వారి యొక్క అనుభవాలను ఇతరులతో పంచుకునేవాళ్లు. తమదైన శైలిలో ప్రత్యేకంగా ఫోటోలు తీసుకొని వారు వారి యొక్క అభిరుచులను పంచుకునేవారు. సహజ సిద్ధమైన వ్యవసాయం చేసుకునేందుకు పంట పొలాలకు నీళ్లు ఈ చెరువు నుంచి తూముల ద్వారా అలుగుద్వారా ఉపయోగించుకునేవారు. అదే రకంగా ఈ చెరువుపై మత్స్యకారులు మిగతా ఇంకా ఆ నీటి ఆధారం పడ్డవాళ్లు ఎందరో. అలాంటి ఆవరణము ఈ అమీన్‌పూర్ చెరువు జలావరణం.


చెరువుల జీవవైవిధ్యం పెంచుకోవాల్సిన అవసరం అందరిది: సదా పర్యావరణ శ్రేయస్సు కోరే, ప్రకృతి పర్యావరణం శ్రేయస్సు కోరే, ఇంతటి జీవవైవిధ్యము ఉన్న చెరువు అన్యాక్రాంతమైపోతోంది. ఓవైపు ఆక్రమణలు, ఇంకోవైపు పట్టణ మనుష్య ఆవాసాల నుండి మురికి నీటిపారుదలతో కాలుష్యానికి ఆలవాలమై దాని సహజ, గుణాలు, భౌతిక, భౌగోళిక స్థితిగతులను, భౌతిక, రసాయనిక లక్షణాలను కోల్పోతుంది. దీనికి స్వార్థపూరితమైన మానవ చర్యలే కారణం అనేక రకాలైన జీవజాతులు, పక్షులు, స్థూల, సూక్ష్మ జంతువులు, వృక్షాల జంతు, వృక్ష ప్లవకాలు ఆహారపు గొలుసు కొరకు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నటువంటి ఇంత ఆహ్లాదకరమైన విభిన్న జీవవైవిధ్యమున్న విశిష్టతకు మూల కారణమైన చెరువును ఇప్పటికైనా సహజ, ప్రకృతి ప్రేమికులు, పర్యావరణవేత్తలు, పర్యావరణ ప్రేమికులు, సహజ వనరుల రక్షకులు, ప్రకృతి రక్షణ కొరకు పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు మొదలగు వారు ముందుకు వచ్చి రక్షించి మిగిలిన వాళ్లకు ఆదర్శం అవ్వాలని ఆకాంక్షించి పాల్గొనాలి.

నీటి రసాయనిక కాలుష్య పరిస్థితి: అమీన్ పూర్ లేక్ నీటి నాణ్యత, జీవవైవిధ్యం పరంగా చాలా కీలకమైన ఆవాసం. అయితే ఇటీవల కాలంలో రసాయనిక కాలుష్యం, మానవ ఒత్తిళ్ల వల్ల దీని సహజ సమతుల్యత దెబ్బతింటోంది. దీనిని శాస్త్రీయంగా ఇలా అర్థం చేసుకోవచ్చు: చెరువులోకి చేరే మురుగునీరు, గృహ వ్యర్థాలు, పరిశ్రమల నుంచి వచ్చే రసాయనాలు నీటి నాణ్యతను తగ్గిస్తున్నాయి. ముఖ్యంగా నైట్రేట్లు, ఫాస్ఫేట్లు, అమోనియా వంటి పోషకాలు అధికంగా చేరడం వల్ల నీరు యూట్రిఫికేషన్ దశలోకి వెళ్తోంది. బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బి.ఓ.డి): ఇది నీటిలో ఉన్న ఆర్గానిక్ కాలుష్యాన్ని సూచిస్తుంది. సాధారణంగా 3 మి. గ్రా./లీ. లోపే ఉండాలి. చెరువులో ప్రస్తుతం ఎక్కువగా ఉండే అవకాశం □ కాలుష్యం అధికం. కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (సి.ఓ.డి) రసాయన కాలుష్యాన్ని కొలిచే పరిమాణం. ఎక్కువగా ఉంటే □ పరిశ్రమల లేదా గృహ వ్యర్థాల ప్రభావం. డిస్సోలవేడ్ ఆక్సిజన్ (డి.ఓ) జీవరాశుల కోసం అత్యంత ముఖ్యమైనది. 5 మి. గ్రా./లీ పైగా ఉండాలి. ప్రస్తుతం డి.ఓ తగ్గే ప్రమాదం □ చేపల మరణాలు. జూప్లాంక్టన్ & ఫైటోప్లాంక్టన్: జూప్లాంక్టన్ నీటిలో ఉండే సూక్ష్మ జంతువులు. ఇవి ఫుడ్ చైన్‌లో కీలకం. కాలుష్యం పెరిగితే వాటి వైవిధ్యం తగ్గుతుంది. ఫైటోప్లాంక్టన్ సూక్ష్మ మొక్కలు (ఆల్గీ) పోషకాలు ఎక్కువైతే వీటి పెరుగుదల ఎక్కువ □ అల్గల్ బ్లూమ్స్, యూట్రిఫికేషన్ అంటే నీటిలో పోషకాలు అధికంగా చేరడం అనగా ఆల్గీ అధికంగా పెరగడం. డి.ఓ తగ్గడం □ చేపలు చనిపోవడం.ప్రస్తుతం అమీన్‌పూర్ చెరువు ఈ దశలోకి వెళ్తోంది.

నీటి చట్టాలు మరియు చెరువు రక్షణ: ది వాటర్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ అఫ్ పొల్యూషన్) యాక్ట్,1974. ఇది నీటి కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రధాన చట్టం. కాలుష్యం చేసే వారిపై చర్యలు తీసుకునే అధికారం. మరొక ముఖ్యమైన చట్టం ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్,1986. ఇది పర్యావరణాన్ని రక్షించేందుకు సమగ్ర చట్టం. ఈ చట్టంద్వారా చెరువులు, జీవవైవిధ్యానికి రక్షణ పండుతాయి. నీటి ఆవాసాల రక్షణ (హాబిటేట్ ప్రొటెక్షన్): చెరువు చుట్టూ బఫర్ జోన్ ఏర్పాటుచేయడం, మురుగునీటికి సేవజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్.టీ.పి) విధిగా ఏర్పాటు చేసుకోవాలి. అలాగే చెరువులోకి ప్లాస్టిక్ నిషేధం, చెరువులో శాస్త్రీయ పద్ధతిలో జీవవైవిధ్య మానిటరింగ్ చేయాలి, నిరంతరం ప్రజల భాగస్వామ్యంతో చెరువు ఆవాసాన్ని కాపాడుకోవాలి. సమగ్రంగా అమీన్ పూర్ లేక్ ప్రస్తుతం యూట్రిఫికేషన్ + కాలుష్య ఒత్తిడి మధ్య నిలిచింది. సరైన చర్యలు తీసుకోకపోతే ఇది పూర్తిగా కాలుష్య కాసారంగా మారే ప్రమాదం ఉంది. కానీ సమయానికి శాస్త్రీయ చర్యలు, కఠిన అమలు, ప్రజల భాగస్వామ్యం ఉంటే మళ్లీ జీవవైవిధ్య కేంద్రంగా మారే అవకాశం ఉంది.

భారత రాజ్యాంగము ఆర్టికల్ 51, ఎ, (జి) ప్రకారం మన ప్రాథమిక విధి: మన చుట్టూ ఉన్న మన సహజ సంపాదన, మన సహజ వనరులు మన ఆస్తి, మన దేశము ఆస్తి. కాబట్టి దీనిని రక్షించుకునే బాధ్యత కూడా మనకు భారత రాజ్యాంగము ఆర్టికల్ 51, ఎ, (జి) ప్రకారం మనకు కల్పించినటువంటి ప్రాథమిక విధి (ఫండమెంటల్ డ్యూటీ). ఈ విధి నిర్వహణలో మనము గనక లోపాన్ని కనిపెట్టి అలాంటి ఆక్రమణలను, కాలుష్యాన్ని ఆపి రక్షించుకోకపోతే మన భవిష్యత్తులో నీటికోలను అన్ని మురికి కూపాలుగా మారిపోయి అన్యకాంతమవుతాయి. రాబోవు తరాలకు ఈ వారసత్వ జాతీయ ఆస్తిని మనము ఏమీ ఇవ్వలేము. అది మన తప్పే అవుతుంది. ఆక్రమణలను కఠినంగా తొలగించడం, చెరువులోకి మురుగునీరు చేరకుండా శుద్ధి వ్యవస్థలు ఏర్పాటు చేయడం, చెత్త పారవేయడంపై కఠిన నియంత్రణలు అమలు చేయడం అవసరం.

*ప్రస్తుత స్థితిగతులు (కరెంట్ స్టేటస్): అమీన్‌పూర్ చెరువు కేవలం ఒక నీటి వనరు మాత్రమే కాదు, వందలాది పక్షులకు నిలయం. కానీ నేడు ఈ చెరువు ప్రమాదంలో ఉంది. పక్షుల విడిదిగా ఈ చెరువు సుమారు 170కి పైగా పక్షి జాతులు (ఫ్లెమింగోలు, పెలికాన్లు మొదలైనవి) ఇక్కడికి వస్తుంటాయి. కాలుష్య కోరల్లో పూర్తిగా చిక్కుకుని చుట్టుపక్కల పరిశ్రమల నుండి వచ్చే వ్యర్థాలు మరియు మురుగునీరు చెరువులోకి చేరడం వల్ల నీటి నాణ్యత దెబ్బతింటోంది. అక్రమ ఆక్రమణలు చెరువు చుట్టూ జరుగుతున్న అక్రమ నిర్మాణాలు మరియు మట్టి పూడ్చివేత వల్ల చెరువు విస్తీర్ణం క్రమంగా తగ్గిపోతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు ఇక్కడ పర్యాటకులు వదిలివెళ్లే ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్ల వల్ల ఇక్కడి జీవవైవిధ్యం నశిస్తోంది. మనం ఎదుర్కొంటున్న సవాళ్లలో ముఖ్యమైనవి ప్రకృతిని మనం కాపాడితే.. ఆ ప్రకృతి మనల్ని కాపాడుతుంది. 1. నీటి గుర్రపుడెక్క: చెరువుపై పేరుకుపోతున్న గుర్రపుడెక్క వల్ల నీటిలోని ఆక్సిజన్ తగ్గి చేపలు, ఇతర జీవులు చనిపోతున్నాయి. 2. దుర్వాసన: మురుగునీరు కలవడం వల్ల స్థానికులకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. 3. భూగర్భ జలాలు: చెరువు కలుషితమైతే చుట్టుపక్కల ఉన్న బోర్లలోని నీరు కూడా విషతుల్యమవుతుంది.




చెరువులను కాపాడుకోవడం సామాజిక, సామూహిక బాధ్యత: కాబట్టి పర్యావరణ ప్రేమికులు, పర్యావరణ మిత్రులు, పర్యావరణ రక్షకులు, పర్యావరణవేత్తలు, పర్యావరణ పరిశోధకులు, పర్యావరణ విద్యార్థులు, పర్యావరణ విద్యావేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, అటవీ ఛాయా చిత్రకారులు (వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్స్), అందరూ కలిసికట్టుగా ముందుకు వచ్చి మన సహజ వనరులను మనము రక్షించుకునే దిశలో ఇలాంటి అమీన్‌పూర్ చెరువు లాంటి అనేక చెరువులను కాపాడుకోవాలి, అందుకు ముందుకు రావాలి. ముందుకొచ్చి మన ముందు నడుస్తున్న వారికి చేయూతనివ్వాలి. ఈ పరిస్థితిని మార్చాలంటే కేవలం ప్రభుత్వ చర్యలే కాకుండా స్థానిక ప్రజల భాగస్వామ్యం కూడా అవసరం. పర్యావరణంపై అవగాహన పెంచి, చెరువు పరిరక్షణను ఒక సామూహిక బాధ్యతగా మార్చితేనే దీన్ని తిరిగి జీవవైవిధ్య కేంద్రంగా నిలబెట్టవచ్చు. చెరువు కేవలం నీటి నిల్వ మాత్రమే కాదు——అది ప్రకృతి శ్వాస. అమీన్ పూర్ లేక్ ను కాపాడటం అంటే మన భవిష్యత్తును కాపాడటమే. మనకి మన పూర్వీకులు ఇచ్చినట్లే మన రాబోవు తరాలకు ఈ సహజ వనరులైన జాతీయ సంపదను వారసత్వ ఆస్తిగా కాపాడి తిరిగి ఇవ్వాలి.

మనం చేయగలిగేది ఏమిటి? (యాక్షన్ ప్లాన్): వ్యర్థాలను పారవేయకండి: చెరువులో లేదా గట్టుపైన చెత్తను వేయకండి. ఆక్రమణలను అడ్డుకుందాం: చెరువు భూమిని ఆక్రమిస్తుంటే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయండి. ప్రభుత్వానికి విన్నపం: మురుగునీటి శుద్ధి ప్లాంట్లను (ఎస్.టీ.పి) ఏర్పాటు చేయాలని కోరుదాం. అవగాహన పెంచుదాం: అమీన్‌పూర్ గొప్పతనాన్ని పర్యావరణ ప్రేమికులకు మరియు రాబోయే తరాలకు తెలియజేద్దాం. నినాదం: అమీన్‌పూర్ చెరువును రక్షించుకుందాం పర్యావరణాన్ని కాపాడుకుందాం! ముఖ్య గమనిక: ఈ చెరువును కాపాడుకోవడం అంటే కేవలం నీటిని కాపాడుకోవడం కాదు, మన భవిష్యత్తును కాపాడుకోవడం. ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలి.



రవి బాబు పిట్టల, పర్యావరణవేత్త,
జే.ఎన్.టీ.యూ.హెచ్, హైదరాబాద్.
సెల్: +919849425271

# 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు రాజశేఖర్ రెడ్డికి ఆహ్వానం

**చిగురుమామిడి, మే 10(ప్రజాక్షేత్రం):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లె గ్రామ వాస్తవ్యుడు,ప్రముఖ కవి రచయిత గాయకుడు కల్వల రాజశేఖర్ రెడ్డికి రాజమహేంద్రవరం నగరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ వేదికగా చైతన్య సారస్వత పరిషత్ సౌజన్యంతో ,అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీ శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో 2026సంవత్సరం జూన్ 6,7తేదీల్లో నిర్వహించబడుతున్న 7వ ప్రపంచ తెలుగు మహాసభలకు ప్రత్యేక ఆహ్వానం అందిందని రాజశేఖర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సన్నీళ్ల కవిత వెంకటేశ్, ఉపసర్పంచ్ వడ్లకొండ నరేందర్ రెడ్డి, కార్యదర్శి గోల్లేని సంపత్, వార్డు సభ్యులు బొమ్మగాని వెంకటేశ్ గౌడ్, మంద శ్రీనివాస్, కూన సురేశ్, అన్నవేని శ్రీనివాస్, బరిగెల చొక్కయ్య,గట్టు సంపత్, చెన్నవేని సతీశ్, దారవేని సమ్మయ్య,రెడ్డి సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి రాజిరెడ్డి, అన్నాడి సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపిటీసీ సింగిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, దారవేని మొండయ్య, రాంగోపాల్ రెడ్డి, సువర్ణ చారి, నాయకులు నరాల రాజయ్య, కలువల రాజేశ్వర్ రెడ్డి, కలువల సంపత్ రెడ్డి, అన్నాడి మల్లికార్జున్ రెడ్డి, గట్టు ప్రశాంత్, సింగిరెడ్డి మధుసుదన్ రెడ్డి, బొమ్మగాని మధు, గట్టు శ్రీనివాస్, జెల్ల కుమార్, దేవునూరి రాజ్ కుమార్, గందె రమేశ్, బత్తిని రాజు పాల్గొని రాజశేఖర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.


చైతన్య సారస్వత పరిషత్ సౌజన్యంతో...
శ్రీశ్రీ కళావేదిక
7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలు
ఆహ్వానం



# మద్యం మత్తులో ప్లంబర్ ఆత్మహత్య

- **నేను చనిపోతున్నా అంటూ భార్యకు ఫోన్ చేసి ఆత్మహత్య**




**కుత్బుల్లాపూర్ మే 10(ప్రజాక్షేత్రం):** పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి కొంపల్లి కుమ్మరబస్తీ ప్రాంతంలో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మద్ మదర్ (32), వృత్తిరీత్యా ప్లంబర్, కుమ్మరబస్తీ నియర్ మజీద్ ప్రాంతానికి చెందినవాడు. అతనికి సుమారు తొమ్మిది సంవత్సరాల క్రితం సభేరా బేగంతో వివాహం కాగా ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడు మద్యానికి బానిసై తరచూ మద్యం సేవిస్తూ ఇంట్లో భార్యతో గొడవ పడేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలో కూడా మద్యం మత్తులో రెండుసార్లు చేతులు కోసుకొని ఆత్మహత్యా యత్నం చేసినట్లు సమాచారం. శుక్రవారం మృతుడు భార్యతో రూ.200 కోసం గొడవపడి డబ్బులు తీసుకొని మద్యం సేవించేందుకు వెళ్లాడు. అనంతరం రాత్రి 8:30 గంటల సమయంలో భార్యకు ఫోన్ చేసి "నేను చనిపోతున్నాను" అని చెప్పాడు. దీంతో ఆమె వెంటనే బంధువులకు సమాచారం ఇవ్వగా, స్థానికులు వచ్చి ఇంటి తలుపు పగులగొట్టి చూడగా అప్పటికే అతడు ఉరివేసుకొని మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య సభేరా బేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పెద్దకొడప్‌గల్ ప్రధాని సభకు భారీగా తరలిన బీజేపీ శ్రేణులు

- **సభకు బయలుదేరిన బీజేపీ నాయకులు**

**పెద్దకొడప్‌గల్, మే 10(ప్రజాక్షేత్రం):** మండలం నుండి ప్రధాని నరేంద్ర మోదీ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే భారీ ప్రజాసభకు హాజరుకావడానికి పెద్దకొడప్‌గల్ మండలం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు భారీగా బయలుదేరారు. బీజేపీ మండల అధ్యక్షులు సుభాష్, యువజన నాయకుడు తానాజీ రావ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సుల్లో ఉత్సాహంగా నినాదాలు చేస్తూ హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో విశేష ఆదరణ ఉందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు, యుత్ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# ఏఎస్ఆర్ ఫర్నిచర్ షోరూమ్ ప్రారంభం



**నాగారం,మే 10(ప్రజా క్షేత్రం):** ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్‌లో ఆర్ఎల్ నగర్ నుంచి రాంపల్లి వెళ్లే ప్రధాన రహదారి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ఏఎస్ఆర్ ఫర్నిచర్ షోరూమ్‌ను మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్‌లో అందుబాటులో ఉన్న వివిధ రకాల ఫర్నిచర్ ఉత్పత్తులను పరిశీలించిన ఆమె నిర్వాహకుడు శ్రీనివాస్ రెడ్డిని అభినందించారు. వినియోగదారులకు నాణ్యమైన ఫర్నిచర్‌ను అందుబాటు ధరల్లో అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.







# పోక్సో కేసుతో బండి సంజయ్ కుటుంబంపై రాజకీయ దుమారం

- **పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ మహిళల ఆందోళన**
- **మైనర్ బాలికకు న్యాయం చేయాలి..బండి సంజయ్ రాజీనామా చేయాలి**

**కుత్బుల్లాపూర్ మే 10(ప్రజాక్షేత్రం):** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసు తీవ్ర రాజకీయ దుమారాన్ని రేపుతోంది. ఈ కేసులో మైనర్ బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాళ్లు పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ, మైనర్ బాలికపై జరిగిన ఘటన అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలు కుత్బుల్లాపూర్‌కు చెందినదని, ఆమెకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలవాలని కోరారు. కేసు నమోదై మూడు రోజులు గడిచినా ఇప్పటివరకు పోలీసులు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడంపై మహిళలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సాధారణ ప్రజలపై వేగంగా స్పందించే పోలీసులు, రాజకీయ నాయకుల కుటుంబ సభ్యుల విషయంలో మాత్రం ఆలస్యం చేయడం ఎందుకని ప్రశ్నించారు. "చట్టం ముందు అందరూ సమానమేనని ప్రభుత్వం నిరూపించాలి. బాధితురాలికి న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది" అని మహిళా నాయకురాళ్లు స్పష్టం చేశారు.

# పేదలకు ఆరోగ్య భద్రతను కల్పిస్తున్న సీఎం సహాయ నిధి

**కుత్బుల్లాపూర్, మే 10(ప్రజాక్షేత్రం):** పేద ప్రజలకు ఆరోగ్య భద్రతను అందిస్తూ ఆపద్బాంధవంగా నిలుస్తోంది సీఎం సహాయ నిధి అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. 130 డివిజన్‌కు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు సుమారు రూ.1,76,000 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా మారిందన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, కోల శ్రీకాంత్ ముదిరాజ్ పాల్గొన్నారు. అలాగే నాయకులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు హాజరయ్యారు.



# ప్రధానమంత్రి మోడీ సభకు భారీగా తరలిన బీజేపీ శ్రేణులు

**కుత్బుల్లాపూర్, మే 10(ప్రజాక్షేత్రం)** దుండిగల్ సర్కిల్ పరిధి దుండిగల్ లో సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వర చారి ఆధ్వర్యంలో దుండిగల్ డివిజన్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బయలుదేరారు. ఈ సందర్భంగా పార్టీ జెండాలతో, నినాదాలతో ఉత్సాహంగా ర్యాలీ నిర్వహిస్తూ సభకు తరలివెళ్లారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, యువమోర్చా సభ్యులు, మహిళా కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# గ్రామాభివృద్ధిపై ఎంపీ ఆర్. కృష్ణయ్యకు మల్కాపూర్ సర్పంచ్, ఉపసర్పంచ్‌ల వినతి

- **సానుకూలంగా స్పందించిన ఎంపీ**

**కొండాపూర్ మే 10(ప్రజాక్షేత్రం):** మల్కాపూర్ గ్రామ సమగ్ర అభివృద్ధి కోసం ఎంపీ ఆర్. కృష్ణయ్య ను ఆ గ్రామ సర్పంచ్ మరియు ఉపసర్పంచ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వారు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల మరియు తాగునీటి సమస్య పరిష్కారం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. స్థానిక పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన సౌకర్యాల కల్పనపై చర్చించారు. బీసీ నిధుల కేటాయింపు.. వెనుకబడిన తరగతుల సంక్షేమం మరియు వారి కాలనీల్లో అభివృద్ధి పనుల కోసం ఎంపీ ల్యాడ్స్ నిధుల నుండి సహకారం అందించాలని విన్నవించారు.

**ఎంపీ హామీ...**

సర్పంచ్ మరియు ఉపసర్పంచ్‌ల విన్నపంపై సానుకూలంగా స్పందించిన ఎంపీ ఆర్. కృష్ణయ్య, మల్కాపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల కోసం సంబంధిత అధికారులతో మాట్లాడతానని ఆయన పేర్కొన్నారు.



# కార్మిక హక్కుల పరిరక్షణకు సీఐటీయూ ఆందోళన

- **కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్: కీలుకాని లక్ష్మణ్**
- **నాలుగు లేబర్ కోడ్స్ వెంటనే ఉపసంహరించాలి**
- **లేబర్ కోడ్స్ జీవో కాపీల దహనం**
- **షాపూర్ నగర్‌లో సీఐటీయూ నిరసన కార్యక్రమం**

**కుత్బుల్లాపూర్ మే 10(ప్రజాక్షేత్రం):** సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ శుభం హోటల్ సమీపంలోని భవన నిర్మాణ కార్మికుల సంఘం అడ్డా వద్ద నాలుగు లేబర్ కోడ్స్ అమలుకు సంబంధించిన జీవో కాపీలను దహనం చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పసుల అంజయ్య, కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులపై దాడి చేస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్స్ కార్మికులను బానిసలుగా మార్చే విధంగా ఉన్నాయని, ఎనిమిది గంటల పనిదినం, కనీస వేతనం, సామాజిక భద్రత వంటి కార్మిక హక్కులను బలహీనపరిచే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని, కార్మికుల శ్రమను చౌకగా దోపిడీ చేసే విధానాలను అమలు చేస్తున్నదని మండిపడ్డారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాషా, శ్రీశైలం, యాదవ రెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



# మైత్రీనగర్ కాలనీలో తీరిన విద్యుత్ కష్టాలు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

- **సర్పంచ్ అనిల్, ఉపసర్పంచ్ చొరవతో దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం**
- **విద్యుత్ అధికారుల స్పందన అభినందనీయం**

**కొండాపూర్, మే 10(ప్రజాక్షేత్రం):** సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామంలోని మైత్రీనగర్ కాలనీ ప్రజల దీర్ఘకాలిక విద్యుత్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. చాలరోజులుగా ఈ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లోవోల్టేజ్ సమస్యలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాత లైన్లపై అదనపు భారం పడటం వల్ల తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోయేది ఈ సమస్యను గుర్తించిన సర్పంచ్ అనిల్ ఉపసర్పంచ్ ప్రవీణ్, వార్డు సభ్యుడు అనిల్ విద్యుత్ శాఖాధికారులతో సమన్వయం చేసుకుని యుద్ధప్రతిపాదికన కాలనీలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి రావడంతో ఇకపై నిరంతరాయంగా విద్యుత్ అందనుంది.

**అధికారుల సహకారం:**

కొండాపూర్ సెక్షన్ ఏఈ (ఏఈ) సిద్దరాజ్ పర్యవేక్షణలో లైనమెన్ శంకర్ మరియు సిబ్బంది ఈ కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి, కనెక్షన్లను పునరుద్ధరించారు. తమ సమస్యను అర్థం చేసుకొని, వెంటనే స్పందించి విద్యుత్ కష్టాలను తీర్చినందుకు మైత్రీనగర్ కాలనీ నివాసితులు సర్పంచ్, ఉప సర్పంచ్ మరియు విద్యుత్ శాఖ ఏఈకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో గృహ అవసరాలకు ఎంతో మేలు జరుగుతుందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై పైళ్ల ఆగ్రహం

**వలిగొండ మే 10(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా నందనం ఐకేపీ కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పరిశీలించారు. తేమ శాతం పేరుతో 15 రోజులుగా ధాన్యం కొనుగోలు చేయకపోవడంపై ప్రభుత్వంపై మండిపడ్డారు. రైతులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# ధాన్యం అన్‌లోడింగ్‌లో ఆలస్యం చేస్తే కఠిన చర్యలు

- మిల్లర్లకు అదనపు కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరిక

**వనపర్తి, మే 10(ప్రజాక్షేత్రం):**



వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు చేరుతున్న లారీలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయకుండా వెంటనే అన్‌లోడింగ్ చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్‌కుమార్ మిల్లర్లకు స్పష్టం చేశారు. రైతులు మిల్లుల వద్ద గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి రాకూడదని అధికారులను ఆదేశించారు. ఆదివారం శ్రీరంగాపూర్ మండలం శేరిపల్లి గ్రామంలోని సప్తగిరి రైస్‌మిల్లును అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించి మిల్లు యాజమాన్యం, సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. మిల్లుకు చేరుకున్న ప్రతి వాహనాన్ని వెంటనే ఖాళీ చేయాలని, ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ధాన్యం అన్‌లోడింగ్ సమయంలో కిలోల రూపంలో ఎటువంటి తరుగు తీయరాదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పూర్తిస్థాయిలో ధాన్యాన్ని స్వీకరించాలని, రైతులకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు కష్టపడి పండించిన పంట విషయంలో మిల్లర్లు నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించబోమన్నారు. ప్రతి రైస్‌మిల్లుకు నియమితులైన స్పెషల్ ఆఫీసర్లు లారీల రాకపోకలకు సంబంధించిన ఎంట్రీ, ఎగ్జిట్ వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. లారీ ఎప్పుడు వచ్చింది, ఎప్పుడు అన్‌లోడింగ్ పూర్తయ్యిందనే వివరాలు స్పష్టంగా నమోదు చేయాలన్నారు. లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి రైస్‌మిల్లుకు గ్రామ పంచాయతీ అధికారులను (జీపీవోలు) నియమించినట్లు తెలిపారు. వారు మిల్లు వద్దే ఉండి ధాన్యం సేకరణ పారదర్శకంగా జరిగేలా చూడనున్నారని పేర్కొన్నారు. ఎక్కడైనా తరుగు పేరిట మోసం చేసినా, వాహనాలను నిలిపివేసినా కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు.

# రైస్ మిల్లర్లు లారీ యజమానులు రైతులతో సమావేశం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే

**వలిగొండ మే 10(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో రైస్ మిల్లర్లతో మరియు లారీల యజమానులు రైతులతోసమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా జిల్లా కిసాన్ సేల్ నాయకులు బండారు నరసింహారెడ్డి మాట్లాడుతూ రైస్ మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారని ఒక బస్తా పేరు మీద కిలో కిలోనరా తీసుకుంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు వెంటనే స్పందించి ఎమ్మెల్యే రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు వడ్లు త్వరగా కొనుగోలు చేయాలని రైస్ మిల్లర్లతోవడ్లు కొనుగోలు చేసి వెంటనే రైతులకు ఎలాంటి ఇబ్బంది కలవకుండా చూడాలని రైస్ మిల్లర్లను లారీ యజమానుల ను సంబంధిత వ్యవసాయ అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి వెంటనే లారీలను పంపించవలసిందిగా ఆదేశించారు,



# శ్రీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దొంతి

**నర్సంపేట మే 10(ప్రజాక్షేత్రం):**

నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వేణుగోపాల వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలలో నేడు మహా కుంభాభిషేకం కావడంతో నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు అనంతరం అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.



# ప్రజలతో మమేకమవుతున్న ఎస్ఐ ప్రశాంత వర్ధనుడు

- శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజాభిమానాన్ని చూరగొంటున్న యువ పోలీస్ అధికారి
- పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరికి ఆత్మీయ పలకరింపు
- నేర నియంత్రణలో కఠినం... ప్రజలతో వ్యవహారంలో మృదుత్వం
- మండలంలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు పెద్దపీట
- శాంతిభద్రతల పరిరక్షణలో కఠిన చర్యలు
- సీసీ కెమెరాలపై మండల ప్రజలకు ప్రత్యేక అవగాహన
- అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం
- ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రజా కార్యక్రమాలు
- ప్రజాప్రతినిధులు, యువతతో సత్సంబంధాలు
- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- పోలీసులు అంటే భయం కాదు... భరోసా" అని చూపెడుతున్న ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్
- ప్రజా సమస్యలు ప్రశాంతంగా వింటూ... "ప్రశాంతవర్ధనుడి" గా పేరు
- ప్రజల మనసులు గెలుచుకుంటున్న పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత వర్ధన్





**పెద్దేముల్, మే 10(ప్రజాక్షేత్రం):**

పోలీస్ శాఖ అంటే కేవలం చట్ట అమలు మాత్రమే కాకుండా ప్రజలకు భరోసా కల్పించే వ్యవస్థ కూడా అని నిరూపిస్తూ పెద్దేముల్ మండల ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ ప్రజల మన్ననలు పొందుతున్నారు. విధుల్లో క్రమశిక్షణ, ప్రజల పట్ల ఆప్యాయత, నేరాల నియంత్రణలో కఠిన వైఖరి కలగలిపి ఆయన మండల ప్రజలకు మరింత చేరువవుతున్నారు.మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరిస్తూనే, మరోవైపు ప్రజల సమస్యలను ఓర్పుతో విని పరిష్కార మార్గాలు చూపిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు.

**పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరికి ఆత్మీయ స్వాగతం**

పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే బాధితులను ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ మర్యాదపూర్వకంగా పలకరిస్తున్నారు. స్టేషన్‌కు వచ్చిన వారిని మర్యాదపూర్వకంగా కూర్చోబెట్టి వారి సమస్యలను ఓపికగా వింటూ, వారికి సత్వర న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు.ఈ విధానంతో ప్రజల్లో పోలీసుల, పోలీసు వ్యవస్థపై విశ్వాసం పెరుగుతుండగా, స్టేషన్‌కు వచ్చే వారు కూడా సానుకూల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**మండలంలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు పెద్దపీట**

ప్రజలకు పోలీస్ శాఖపై మరింత విశ్వాసం పెరిగేలా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "ఫ్రెండ్లీ పోలీసింగ్" విధానాన్ని పెద్దేముల్ ఎస్ఐ ఎం. ప్రశాంత్ వర్ధన్ పక్కాగా అమలు చేస్తున్నారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మాట్లాడటం, వారి సమస్యలను ఓర్పుతో వినడం, వారిలో ఉన్న భయాన్ని తొలగించేలా ధైర్యం చెప్పడం ద్వారా ప్రజలకు చేరువవుతున్నారు.ప్రత్యేకంగా మహిళలు, వృద్ధులు, బాధితులకు మర్యాదపూర్వక వాతావరణం కల్పిస్తూ వారి ఫిర్యాదులను సానుకూలంగా స్వీకరిస్తున్నారు. "పోలీసులు అంటే భయం కాదు... భరోసా" అనే భావనను ప్రజల్లో కల్పించడంలో ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ ముందుంటున్నారు.
గ్రామాల్లో నిర్వహించే సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు,యువతతో చర్చల ద్వారా కూడా ఫ్రెండ్లీ పోలీసింగ్ భావనను ప్రజల్లోకి తీసుకెళ్తూ పోలీస్‌ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేస్తున్నారు.

**శాంతిభద్రతల పరిరక్షణలో కఠిన చర్యలు**

మండలంలో నేరాలు, ఘోరాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతూ ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పర్యటిస్తూ అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచుతున్నారు.రాత్రి పహారా, గ్రామ స్థాయి సమావేశాలు, యువతతో చర్చలు నిర్వహిస్తూ శాంతియుత వాతావరణం నెలకొనేలా కృషి చేస్తున్నారు.

**సీసీ కెమెరాలపై ప్రత్యేక అవగాహన**

నేర నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ మండలంలోని అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో, వ్యాపార సంస్థల్లో, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలను ప్రోత్సహిస్తున్నారు.సీసీ కెమెరాల వల్ల నేరాల నియంత్రణతో పాటు దర్యాప్తు సులభతరం అవుతుందని ఆయన ప్రజలకు వివరిస్తున్నారు.

**అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం**

మండలంలో అక్రమ ఇసుక రవాణాపై ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ కఠిన చర్యలు చేపడుతున్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.దీంతో అక్రమార్కుల్లో భయం నెలకొనగా, మండలంలో అక్రమ కార్యకలాపాలపై నియంత్రణ పెరిగిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రజా కార్యక్రమాలు**

జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు, తాండూర్ డివిజన్ అధికారులు సూచించిన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ ముందుకు సాగుతున్నారు. అవగాహన సదస్సులు, యువతకు మార్గదర్శక కార్యక్రమాలు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు వంటి పలు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో ఆయనకు ఉన్నతాధికారుల ప్రశంసలు కూడా లభిస్తున్నాయి.

**ప్రజాప్రతినిధులు, యువతతో సత్సంబంధాలు**

మండలంలో ఆయా రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు,గ్రామ నాయకులు, యువత, స్థానిక ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ అందరి ఆదరణ పొందుతున్నారు.ప్రజలతో ఎప్పటికప్పుడు మమేకమవుతూ వారి అభిప్రాయాలను తెలుసుకోవడం ద్వారా పోలీస్‌ప్రజల మధ్య సాన్నిహిత్యం పెంపొందిస్తున్నారు.

**రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు**

పెద్దేముల్ మండల పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు పెద్దేముల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ ప్రత్యేక చర్యలు చేపట్టారు.ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా మండలంలోని ప్రధాన రహదారులు, ప్రమాదకర మలుపులు, పాఠశాలలు మరియు గ్రామాల సమీప ప్రాంతాల్లో వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,కార్లలో సీట్ బెల్ట్ వినియోగించాలని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వంటి కారణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రాత్రి వేళల్లో వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని,ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ కోరారు. ప్రజల సహకారంతోనే ప్రమాదాలను తగ్గించవచ్చని పేర్కొంటూ, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. ఎస్ఐ చేపడుతున్న చర్యలను స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు.

**"ప్రశాంతంగా వింటూ... ప్రశాంతవర్ధనుడిగా పేరు"**

పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే ప్రజల, బాధితుల సమస్యలను ప్రశాంతమైన వాతావరణంలో ఓపికగా వింటూ, చట్టపరమైన పరిష్కార మార్గాలు చూపిస్తున్న ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకొని స్పందించే అధికారిగా, శాంతిభద్రతల పరిరక్షణలో కఠినంగా వ్యవహరించే పోలీస్ అధికారిగా పెద్దేముల్ మండలంలో ఆయన మంచి పేరు సంపాదిస్తున్నారు. మొత్తానికి పెద్దేముల్ మండల ప్రజల మనసులను గెలుస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తూ, అక్రమ దందాలపై ఉక్కు పాదం మోపుతూ పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ విధినిర్వహణలో విజయవంతంగా ముందుకు సాగుతున్నారు.

# ఫైర్ ఇంజిన్ ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. ప్రయాణికులకు గాయాలు

**గద్వాల మే 10(ప్రజాక్షేత్రం):**

గద్వాల మండలం పరుమాల స్టేజ్ సమీపంలో ప్రమాదం చోటు చేసుకుంది. ఆర్టీసీ బస్సు అగ్నిమాపక వాహనాన్ని ఢీ కొట్టింది. గద్వాల నుంచి అయిజకు వెళ్తున్న ఆర్టీసి బస్సు ముందుగా వెళ్తున్న ఫైర్ ఇంజిన్ వాహనాన్ని ఢీ కొట్టడంతో బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



# పెద్దపల్లి జిల్లాలో యువకుడి దారుణ హత్య?

**పెద్దపల్లి జిల్లా మే10(ప్రజాక్షేత్రం):**



పెద్దపల్లి జిల్లాలో ఓ దళిత యువకుడి దారుణ హత్యతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి, ఈ హత్యకు ప్రేమ వ్యవ హారమే కారణమని పోలీసులు అనుమాని స్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం... పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జూల వంశీ అనే దళిత యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. మంథని మండలం గాడిదల గండి సమీపంలోని దట్టమైన అడవిలో కుళ్ళిన స్థితిలో యువకుడి మృతదేహం ఆదివారం ఉదయం లభ్యమైంది. ఏప్రిల్ 30న కనబడ కుండా పోవడంతో మూడు నాలుగు రోజుల తర్వాత అతని కుటుంబ సభ్యులు గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యా దు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మృతుడి కాల్ డేటా ఆధారంగా హైదరాబా ద్ కు సంబంధించిన ఒక యువతిని కలవ డానికి వెళ్ళినట్లు గుర్తించిన పోలీసులు ఆ యువతిని ఆమె భర్తను తీసుకొచ్చి విచారణ చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.

**ప్రేమ వ్యవహారమే కారణం**

సింగిరెడ్డిపల్లికి చెందిన వంశీ అదే గ్రామానికి చెందిన ఒక యువతి తో ప్రేమ వ్యవహారం నడిపాడు. తర్వాత క్రమంలో ఆమె వేరొ కరిని ప్రేమ వివాహం చేసుకోవడంతో ఇద్దరి మధ్య బ్రేకప్ అయినట్లు తెలిసింది. కాగా ఇటీవల గ్రామ దేవతల కొలుపు సందర్భంగా తిరిగి గ్రామానికి వచ్చిన యువతితో మళ్లీ అతను చనువుగా వ్యవహరించడంతో ఇద్దరి మధ్య ఫోన్ సంభాషణలు మొదలయ్యాయి. ఇది తెలిసిన ఆ యువతి భర్త చాక చక్యంగా ఆ యువతి తోటే అతన్ని ఏప్రిల్ 30న హైదరాబాద్ కు పిలిపించి హత్య చేసి అతని శవాన్ని మంథని సమీపంలోని గాడిదల గండిలో వేసినట్లు పోలీసుల ముందు ఒప్పుకోవడం తో వంశీ మృతదేహం కుళ్ళిన స్థితిలో లభ్య మైనట్లు సమాచారం. హత్య జరిగి సుమారు పది రోజులు కావడం తో అతని మృతదే హం పూర్తిగా కుళ్లిన స్థితిలో లభ్యమైంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# షాపింగ్ కోసం బయలుదేరి మృత్యువు ఒడిలోకి

- చైతన్య నగర్ గ్రామ శివారులో విషాదం...ఆటో బోల్తా పడి మహిళ మృతి
- ఆటోను అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపిన భర్త మేఘావత్ సురేష్
- వేగం అదుపుతప్పి ఒక్కసారిగా ఆటో బోల్తా
- ఈ ప్రమాదంలో సురేష్ భార్య అంగోత్ నందిని(23) చికిత్స పొందుతూ మృతి
- నందిని మృతితో మన్ సాన్ పల్లి గ్రామంలో విషాదఛాయలు
- మేఘావత్ సురేష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం
- పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్

**పెద్దేముల్, మే 10(ప్రజాక్షేత్రం):**



వేగం అదుపుతప్పి ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి ఓ వివాహిత మహిళ మృతి చెందిన విషాదకరమైన సంఘటన పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చైతన్య నగర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది.ఈ ఘటనకు సంబంధించి పెద్దేముల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.......
వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం మన్ సాన్ పల్లి పల్లి గ్రామానికి చెందిన అంగోత్ నందిని (23)కు చౌడాపూర్ మండలం చిన్న మేఘ్యా నాయక్ తాండాకు చెందిన మేఘావత్ సురేష్‌తో మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది.వీరికి ఒక కుమారుడు ఉన్నాడు.ప్రస్తుతం ఈ దంపతులు హైదరాబాద్‌లోని కాళీమందిర్ ప్రాంతంలో నివాసముంటున్నార.ఇదిలా ఉంటే ఇంట్లో శుభకార్యము నిమిత్తం నందిని తన భర్త సురేష్,కుమారుడితో కలిసి ఈ నెల 8న రాత్రి మన్ సాన్ పల్లి గ్రామానికి వచ్చింది. అనంతరం 9వ తేదీనా మధ్యాహ్న సమయంలో తాండూర్‌కు షాపింగ్ కోసం ఆటోలో బయలుదేరారు.ఈ క్రమంలో చైతన్య నగర్ గ్రామ శివారుకు చేరుకోగానే సురేష్ ఆటోను అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్ల వాహనం అదుపుతప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో నందినికి తీవ్ర గాయాలు కాగా అధిక రక్తస్రావం జరిగింది.వెంటనే ఆమెను తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి,అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వికారాబాద్‌లోని ఈషా ఆసుపత్రికి తరలించారు.అయితే చికిత్స పొందుతూ నందిని మృతి చెందింది.మృతురాలి తండ్రి అంగోత్ నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, నందిని భర్త మేఘావత్ సురేష్‌పై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.

## వైభవంగా అనంత సాహిత్య వేదిక
# వార్షికోత్సవం

- **ముఖ్యఅతిథిగా హాజరైన దేశపతి శ్రీనివాస్**

**శంకర్ పల్లి మే 10(ప్రజాక్షేత్రం):**

అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక మూడో వార్షికోత్సవం ఘనంగా జరిగింది. శంకర్ పల్లిలోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ సమావేశానికి తుల్జారాం సింగ్ ఠాకూర్ సభధ్యక్షత వహించారు. ఈ ఉత్సవానికి ముఖ్య అతిథిగా దేశపతి శ్రీనివాస్ హాజరుకాగా విశిష్ఠ అతిథులుగా డా. తూర్పు మల్లారెడ్డి గౌరవ అతిథులుగా బి. పి. నర్సింహులు గుప్తా, అనంత అధ్యక్షులు టి. ఆశీర్వాదం, ప్రత్యేక అతిథులుగా కోటం చంద్రశేఖర్, అనంత ఉపాధ్యక్షులు మణిపూసల సృష్టికర్త వడిచర్ల సత్యం పాల్గొన్నారు. అనంత సాహిత్య వేదిక ద్వారా ప్రతి సంవత్సరం ఇస్తున్న సుగుణ దోరవేటి తల్లి దండ్రుల పేరున సాహిత్య రంగంలో ఏర్పాటు చేసిన జీవన సాఫల్య పురస్కారాన్ని తొలి కాళోజీ పురస్కార గ్రహీత డా. అమ్మంగి వేణుగోపాల్, చింతామణి జానకీ రామారావు, జూలకంటి శ్వేతా, పాండురంగారెడ్డి మున్సిపల్ వైస్ ఛైర్మన్ పేరున కళా రంగంలో ఏర్పాటు చేసిన పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో కడియాల మధుసూదనరావు, చిగురాల్ పల్లి ప్రసాద్ గారల సంపాదకత్వంలో వచ్చిన అనంత తృతీయ వార్షిక సంచిక, మణిపూసల కవితా ప్రక్రియలో రచించిన భావజలధి పుస్తకాన్ని, ఆకుల మల్లికార్జున, శివ కౌముది పుస్తకాన్ని, ప్రముఖ కవి రచయిత దోరవేటి రచించిన శ్రీరామ దర్శనం నాటకమును ఆవిష్కరించారు. అనంత సాహిత్య వేదిక ప్రధాన కార్యదర్శి కమలేష్ సమన్వయంతో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ... సాహిత్యం, కళలు స్వేచ్ఛగా వికసించాలన్న ధ్యేయంతో ఈ సంస్థ రూపొందడం చాలా అభినందనీయమని పేర్కొన్నారు. కాళోజీ నారాయణ, సురవరం ప్రతాపరెడ్డి వంటి కవులు చేసిన సాహితీ, సామాజిక సేవలను గుర్తు చేశారు. అనంతగిరి ఔషధగిరి అని కొనియాడారు. కవి రాసేటప్పుడు మాత్రమే తల వంచుతాడు. రాసిన తర్వాత తల ఎత్తుకొని నిలబడతడని చెప్పుకొచ్చాడు. గతి తప్పుతున్నప్పుడు కవి దిక్సూచి లాంటి వాడని పేర్కొన్నాడు. భారతీయ జీవన విధానంలో, ఇతిహాసాలలో విశ్వ శ్రేయస్సును కోరుకునే విలువలు ఉంటాయి. మహమ్మద్ షరీఫ్, రవూఫోద్దిన్, శివకుమార్, కడియాల మధుసూదనరావు, రామకృష్ణా రాజు, మావిశ్రీ మాణిక్యం, తాడూరు మోహనాచార్యులు, దుబ్బాకుల కృష్ణస్వామి, పాఠశాల ప్రిన్సిపాల్ రాజేష్ కుమార్, వెన్నెల సత్యం, చిగురాల్ పల్లి ప్రసాద్, తెలంగాణ రాష్ట్రం నలుమూల నుండి వచ్చిన వంద మందికి పైగా కవులు, పండితులు పాల్గొన్నారు.



## మైనర్ బాధితురాలి పట్ల దిగజారుడు మాటలా..?
# కేంద్రమంత్రి బండిపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన ఆరోపణలు!

**హైదరాబాద్ మే 10(ప్రజాక్షేత్రం):**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు వ్యవహారం ఇప్పుడు రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఇవాళ మీడియా వేదికగా బండి సంజయ్‌పై అత్యంత పదునైన మరియు సంచలన ఆరోపణలు చేశారు. 17 ఏళ్ల మైనర్ బాలిక మరియు పోక్సో కేసు బాధితురాలి పట్ల బండి సంజయ్ అత్యంత దిగజారుడుగా ప్రవర్తించారని ఆయన మండిపడ్డారు. బాధితులు న్యాయం కోసం బండి సంజయ్ ఇంటికి వెళ్తే, వారిని ఆదరించాల్సింది పోయి, "నీ బిడ్డ ఎంత మందితో తిరిగిందో ఏమో.. ఆమెను నా కొడుకు పెళ్లి చేసుకోవాలా?" అంటూ అత్యంత అనుచితమైన వ్యాఖ్యలు చేసి వారిని అవమానించారని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఒక ప్రముఖ ఛానెల్‌కు చెందిన జర్నలిస్ట్ మధ్యవర్తిగా వ్యవహరించారని, బాధితులను బండి సంజయ్ ఇంటికి తీసుకెళ్లి బెదిరింపులకు గురిచేశారని ఆయన పేర్కొన్నారు.

**కేంద్రమంత్రి బెదిరింపులు, ఆధారాలకై డిమాండ్**

కేసును నీరుగార్చే ఉద్దేశంతో బాధితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, "నాతో పెట్టుకుంటే మీకు ఏం జరిగిన నా బాధ్యత కాదు" అని సంజయ్ హెచ్చరించినట్లు ప్రవీణ్ కుమార్ వివరించారు. ఈ నిజాలు ప్రపంచానికి తెలియాలంటే హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వెంటనే రంగంలోకి దిగాలని ఆయన డిమాండ్ చేశారు. బండి సంజయ్ ఇంటికి సంబంధించిన సిసిటివి (సిసిటివి) ఫుటేజీని తక్షణం స్వాధీనం చేసుకోవాలని, అలాగే ఈ వివాదంలో ఉన్న బాధితుల, బండి సంజయ్ మరియు సదరు జర్నలిస్ట్ యొక్క ఫోన్ కాల్ రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని కోరారు. పోలీసులు నిందితులను కాపాడాలని చూస్తున్నారని, ఈ కేసులో విచారణ పారదర్శకంగా జరగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



**రాజకీయ ప్రకంపనలు**

ప్రస్తుతం ఈ ఆరోపణలు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారాయి. ఓ వైపు బండి సంజయ్ ఇది తనపై జరుగుతున్న రాజకీయ కుట్ర అని కొట్టిపారేస్తుంటే, మరోవైపు ప్రవీణ్ కుమార్ చేస్తున్న ఈ ఘాటు వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. మైనర్ బాలికకు జరిగిన అన్యాయంపై కేంద్ర మంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం క్షమించరానిదని, తక్షణమే దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.

# మేడారంలో పోటెత్తిన భక్తులు

- **ఎండ తీవ్రతను లెక్కచేయకుండా మొక్కులు సమర్పిస్తున్న భక్తజనం**

**ఏటూరునాగారం క్రైం, మే 10 (ప్రజాక్షేత్రం):**

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్కసారలమ్మ దేవస్థానం పుణ్యక్షేత్రంలో రోజురోజుకు భక్తుల రద్దీ భారీగా పెరుగుతోంది. గతంలో బుధ, గురు, ఆదివారాలకు మాత్రమే ఎక్కువగా భక్తులు దర్శనానికి వచ్చేవారు. అయితే ప్రస్తుతం ప్రతి రోజు జాతర వాతావరణం నెలకొంటోంది. ఆదివారం సెలవుదినం కావడంతో పట్టణాల నుంచి వ్యాపారవేత్తలు, పాఠశాల విద్యార్థులు, కళాశాల యువత, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు భారీ సంఖ్యలో మేడారానికి తరలివచ్చారు. తెలంగాణతో పాటు చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వాహనాలలో చేరుకుని అమ్మవార్లను దర్శించుకున్నారు. జాతర పరిసర ప్రాంతాల్లోని విడిదిగృహాల్లో బస చేస్తూ రెండు రోజుల పాటు మొక్కులు తీర్చుకుని తిరుగు ప్రయాణం అవుతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ భక్తుల రద్దీ మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. భక్తులకు ఎండ తగలకుండా దేవాదాయ శాఖ అధికారులు కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**జంపన్న వాగులో పుణ్యస్నానాలు**

జంపన్న వాగు వద్ద భక్తులు పెద్ద ఎత్తున పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. కొందరు నల్లాల కింద స్నానం చేస్తుండగా, మరికొందరు వాగులోకి దిగి పవిత్ర స్నానాలు చేస్తున్నారు. పిల్లలు, మహిళలు, వృద్ధులు కొత్త వస్త్రాలు ధరించి గద్దెల వైపు చేరుకుంటున్నారు. పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం కొనుగోలు చేసి దేవతలకు సమర్పిస్తూ తమ మొక్కులు తీర్చుకుంటున్నారు. జంపన్న వాగు నుంచి గద్దెల వరకు రహదారులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి.

**తాగునీటి సమస్యతో భక్తుల ఇబ్బందులు**

మేడారం వచ్చిన భక్తులకు తాగునీటి కొరత తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. గద్దెల పరిసరాల నుంచి ప్రధాన రహదారుల వరకు తగిన



తాగునీటి సదుపాయాలు కనిపించడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సంబంధిత శాఖల నిర్లక్ష్య వైఖరి కారణంగా భక్తులు వాటర్ ప్లాంట్ల వద్ద డబ్బులు చెల్లించి నీరు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. రోజురోజుకు భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో మేడారం నిత్య జాతరలా మారిపోయింది. రహదారులన్నీ భక్తుల వాహనాలతో నిండిపోయి సందడి వాతావరణం నెలకొంది







## బిజెపికి రాజకీయ పతనం తప్పదు..
# అఖిలపక్ష నేతల హెచ్చరిక

**హైదరాబాద్ మే 10(ప్రజాక్షేత్రం):**

బిజెపి పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు బిసిలకు అన్యాయం చేస్తూనే ఉందని, బిసిలకు ద్రోహం చేస్తున్న బిజెపి చరిత్రలో పతనం కాక తప్పదని అఖిలపక్ష నేతలు తీవ్రంగా హెచ్చరించారు. జాతీయ జనగణనలో సమగ్ర కులగణన చేపడతామన్న ప్రధాని హామీని విస్మరించినందుకు నిరసనగా ఆదివారం ప్రధాని తెలంగాణ పర్యటనను వ్యతిరేకిస్తూ బిసి సంక్షేమ సంఘం రాష్ట్రవ్యాప్తంగా నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేసింది. హైదరాబాద్‌లోని గన్ పార్క్ వద్ద ఉన్న అమరవీరుల స్థూపం వద్ద బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నల్ల జెండాలతో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ నిరసనలో షాద్‌నగర్ శాసనసభ్యులు, కాంగ్రెస్ పార్టీ ఓబిసి స్టేట్ చైర్మన్ ఈర్లపల్లి శంకర్, తెలంగాణ జన సమితి అధ్యక్షులు ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండరాం, బిఆర్ఎస్ శాసనమండలి ఫ్లోర్ లీడర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అబ్బాస్, మత్స్య కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన సందర్భంగా బిసి సమాజం 'ప్రధానికి పది ప్రశ్నలు' సంధిస్తే 24 గంటలు గడిచినా కేంద్ర ప్రభుత్వం నుండి ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం లేదని విమర్శించారు. బిసి కులగణన చేపడతామని మోసం చేశారని, అందుకే రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేసి ఢిల్లీ పెద్దలకు చెమటలు పట్టించామని తెలిపారు. బిసిలను ఇలాగే మోసగిస్తే భవిష్యత్తులో ప్రధాని పర్యటనను 100 శాతం అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో మెజార్టీ ప్రజల ఆకాంక్షలను గౌరవించాల్సిన బాధ్యత ప్రధానిపై ఉందని, బిసిల డిమాండ్లను పరిష్కరించడంలో నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి పూర్తిగా విఫలమైందన్నారు. బిజెపిపై బిసిలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, బిసిలు చేసే పోరాటానికి తన మద్దతు సంపూర్ణంగా ఉంటుందని ప్రకటించారు. ఈర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బిసిలకు అన్యాయం చేస్తున్న బిజెపికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని, బిసి ప్రధానిగా నరేంద్ర మోడీ ఉన్నందుకు బీసీలు సిగ్గుపడుతున్నారని అన్నారు. తెలంగాణలో జరిగిన కులగణనను మోడల్‌గా తీసుకొని కేంద్రం చేపట్టాలన్నారు. కులగణనపై బిసి సంఘాల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ప్రకటించారు. బిఆర్ఎస్ నేతలు మధుసూదనాచారి, వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. బిజెపి బిసిలకు ద్రోహం చేస్తోందని, భవిష్యత్తులో బిసిల ఆగ్రహానికి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. బిసిలు తలచుకుంటే బిజెపిని బంగాళాఖాతంలో కలపడం ఖాయమని అన్నారు. తక్షణమే కులగణనపై కేంద్రం స్పందించి బిసిలకు న్యాయం చేయకపోతే ప్రధాని ప్రతి పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. మరిన్ని కనుగొనండి ఆధ్యాత్మిక కంటెంట్ వార్త అగ్రిగేటర్ మన తెలంగాణ మ్యాగజైన్ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ బిజెపి ఆవిర్భావం నుండి నేటి వరకు బిసిలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని, నాటి మండల్ ఉద్యమం నుండి నేటి కులగణన ఉద్యమం వరకు బిజెపి వైఖరి మారలేదని ధ్వజమెత్తారు. ప్రజాక్షేత్రంలో బిజెపి బిసి వ్యతిరేక వైఖరిని ఎండగట్టి కోట్లాది బిసిలు ఏకమై బిజెపిని గద్దె దించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సాధన కమిటీ అధ్యక్షులు ధనుంజయ నాయుడు, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, కేతురు వెంకటేష్, తాటికొండ విక్రమ్ గౌడ్, ధనలక్ష్మి, ఉప్పరి శేఖర్ సగర, పగిళ్ల ఆశన్న తదితరులు పాల్గొన్నారు.



## పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..

- **గురువులు కేవలం పాఠాలు చెప్పేవారు మాత్రమే కాదని,వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే మహానుభావులనీ కొనియాడారు.**

**మణుగూరు.మే10(ప్రజాక్షేత్రం)**



ప్రముఖ సాహితీవేత్త, విశిష్ట ఉపాధ్యాయులు, మరియు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు గారి గురువర్యులు అయిన ఎర్రా ప్రగడ రామమూర్తి మాస్టారి విరచిత “స్వగతాలకు స్వాగతాలు” మరియు “నేనొక నిత్య విద్యార్థిని” పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం పినపాక మండలంలోని జివిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పుస్తకాలను ఆవిష్కరించి రచయిత గారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. “గురువులు అనేవారు కేవలం పాఠాలు చెప్పేవారు మాత్రమే కాదు, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే మహానుభావులు". నా గురువర్యులు రామమూర్తి మాస్టారు అందించిన మార్గదర్శకత్వం, విలువలు, క్రమశిక్షణ నా ప్రజా జీవితానికి పునాది” అని అన్నారు.ఈ పుస్తకాలు సమాజానికి మార్గనిర్దేశం చేసే ఆలోచనలను అందిస్తాయని, యువతలో చదువుపై ఆసక్తిని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ముఖ్యంగా “నేనొక నిత్య విద్యార్థిని” పుస్తకం జీవితాంతం నేర్చుకోవాలనే భావనను పెంపొందిస్తుందని, ప్రతి ఒక్కరూ చదవదగిన పుస్తకమని పేర్కొన్నారు. అలాగే “స్వగతాలకు స్వాగతాలు” పుస్తకం ఆత్మపరిశీలనకు దారి తీసే సాహిత్య కృతిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర అపారమని, ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కొనియాడారు. గురువును సన్మానించడం తనకు గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానుకొండ నాగేశ్వర రావు, ఎన్ సి హెచ్ చక్రవర్తి, ఎర్ర ప్రగడ రామకృష్ణ, శత్రువేదుల నాగేంద్ర, దహంగాం సాంబమూర్తి, సన్నిధానం నరసింహారావు శర్మ, అమ్మిన శ్రీనివాసరాజు, మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, సాహితీ ప్రియులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# తమిళనాడు సీఎంగా దళపతి విజయ్ .. 'జన నాయగన్' సినిమా రిలీజ్ ఎప్పుడంటే?

తమిళనాడు రాజకీయ చరిత్రలో నేడు ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. తమిళ సూపర్ స్టార్ 'దళపతి' విజయ్ మే 10వ తేదీన తమిళనాడు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో అత్యంత వైభవంగా జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విజయ్ తన కుటుంబ సభ్యులతో పాటు, తన పార్టీ TVK (తమిళగ వెట్రి కళగం) నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా వచ్చి విజయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

**డ్యాషింగ్ లుక్‌లో సీఎం**

ఎప్పుడూ సింపుల్‌గా కనిపించే విజయ్, తన ప్రమాణ స్వీకార వేడుక కోసం సంప్రదాయ దుస్తులకు భిన్నంగా ఫార్మల్ బ్లాక్ సూట్ - ప్యాంట్ ఎంచుకున్నారు. సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో ఆయన ఎంతో హుందాగా కనిపించారు. వెండితెరపై దళపతిగా అలరించిన విజయ్, ఇప్పుడు నిజ జీవితంలో ప్రజా నాయకుడిగా తన కొత్త ఇన్నింగ్స్‌ను స్టార్ట్ చేయడంపై ఆయన అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ వేడుకలో నటి త్రిష కృష్ణన్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు. తన తల్లి ఉమా కృష్ణన్‌తో కలిసి హాజరైన త్రిష.. చీర కట్టుకుని, తలలో మల్లెపూలు పెట్టుకుని సంప్రదాయబద్ధంగా కనిపించారు. విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తుంటే ఆమె ఎంతో ఉత్సాహంగా కనిపించారు. కార్యక్రమం అనంతరం విజయ్ వారిని కలిసి ముచ్చటించారు.

**బాలనటుడి నుంచి బ్లాక్ బస్టర్ స్టార్ వరకు..**

విజయ్ సినీ ప్రస్థానం తన తండ్రి ఎస్.ఏ.చంద్రశేఖర్ దర్శకత్వంలో బాలనటుడిగా స్టార్ట్ అయ్యింది. 1992లో హీరోగా ఎంట్రీ ఇచ్చినా దళపతి, 1994లో వచ్చిన 'రసిగన్' సినిమాతో తొలి హిట్ అందుకుని 'ఇళయ దళపతి'గా అభిమానుల్లో గుర్తింపు పొందారు. 2003 తర్వాత వరుస విజయాలతో కోలీవుడ్ టాప్ స్టార్‌గా ఎదిగారు. 2017లో 'మెర్సల్' సినిమాతో 'దళపతి'గా మారిన విజయ్, రజనీకాంత్, కమల్ హాసన్ వంటి దిగ్గజాలకు దీటుగా తన మార్కెట్‌ను విస్తరించుకున్నారు.

**'జన నాయగన్' కోసం ఎదురుచూపులు..**

సీఎంగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో విజయ్ నటించిన లాస్ట్ మూవీగా ప్రచారంలో ఉన్న 'జన నాయగన్' రిలీజ్ కోసం అభిమానులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. పూజా హెగ్డే, బాబీ డియోల్, మమితా బైజూ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రం గత ఐదు నెలలుగా రిలీజ్ కాకుండా ఆగిపోయింది. నిజానికి ఈ మూవీ జనవరి 9న రిలీజ్ కావాల్సి ఉన్నా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. అయితే తమిళనాడులో సీఎంగా విజయ్ పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో, ఈ సినిమా కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలోనే ప్రకటించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ సినిమా కోసం విజయ్ ఫ్యాన్స్‌తో పాటు సినిమా లవర్స్ కూడా చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



# టాలీవుడ్‌పై కన్నేసిన 'తుడరుమ్' దర్శకుడు



మలయాళంలో మంచి గుర్తింపు సంపాదించుకున్న దర్శకుల్లో తరుణ్ మూర్తి ఒకరు. ఈయన కొంతకాలం క్రితం మోహన్ లాల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన తుడరుమ్ చిత్రానికి దర్శకత్వం వహించాడు. ఈ సినిమా మలయాళ బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని అందుకుంది. ఇదే టైటిల్‌తో తెలుగులో విడుదలైన ఈ మూవీ టాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర కూడా మంచి విజయాన్ని సాధించింది. దీంతో తరుణ్ మూర్తికి తెలుగు ప్రేక్షకుల్లోనూ మంచి గుర్తింపు లభించింది. ఇక ఈ దర్శకుడు తన తదుపరి చిత్రాన్ని ఓ టాలీవుడ్ హీరోతో చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఓ యువ హీరోకి కథను వినిపించగా, ఆ కథ అతనికి బాగా నచ్చి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు నిర్మాత ఫైనల్ కాలేదని, ప్రొడ్యూసర్ ఓకే అయిన వెంటనే ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.


ఇక 'తుడరుమ్' లాంటి గొప్ప సినిమాతో ఆకట్టుకున్న తరుణ్ మూర్తి తెలుగులో సినిమా చేస్తే ఆ ప్రాజెక్ట్‌పై మంచి అంచనాలు ఏర్పడే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇకపోతే తాజాగా ఈ దర్శకుడు మెగాస్టార్ చిరంజీవిని కలవడం ఇండస్ట్రీలో ఆసక్తికరంగా మారింది. దీంతో చిరంజీవితో ఈయన సినిమా చేయబోతున్నారనే వార్తలు వైరల్ అయ్యాయి. ముఖ్యంగా 'తుడారం' రీమేక్ కోసం ఈ భేటీ జరిగిందని ప్రచారం జరిగింది. అయితే తాజాగా సోషల్ మీడియా వేదికగా దర్శకుడు దీనిపై స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. "నేను చిరంజీవి గారిని 'తుడారం' రీమేక్ గురించి కలవలేదు. చిరంజీవి గారు నన్ను వ్యక్తిగతంగా కలవాలని ఆయన టీమ్ నుంచి కాల్ వచ్చింది. వెంటనే ఫ్లైట్ ఎక్కి ఆయన ఇంటికి వెళ్లి కలిశాను. మేమిద్దరం సినిమాలు, వ్యక్తిగత జీవితంపై చాలా సేపు మాట్లాడుకున్నాం. నేను తీసిన ప్రతి సినిమాలోని సన్నివేశాలను ఆయన ఎంతో వివరంగా చెప్పడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ క్షణం నా జీవితంలో మరచిపోలేని అనుభూతిగా మిగిలిపోతుంది" అని తెలిపారు. అలాగే "ఎప్పటికీ సూపర్‌స్టార్‌గా నిలిచిన చిరంజీవి గారు ఇప్పటికీ సినిమాలను చిన్నపిల్లాడి ఉత్సాహంతో ఆస్వాదించడం ఆయన ప్రత్యేకత. జీవితంలో కొన్ని చిన్న క్షణాలే మన కలలను మరింత పెద్దవిగా మారుస్తాయి. కానీ ఇది చిన్న క్షణం కాదు.. నా జీవితంలోనే అతిపెద్ద ఆనంద క్షణం" అంటూ భావోద్వేగంగా రాసుకొచ్చారు. దీంతో అభిమానుల్లో మరోసారి ఆసక్తి పెరిగింది. చిరంజీవితో ఈ దర్శకుడి కాంబినేషన్‌లో సినిమా ఉండొచ్చని చాలామంది భావిస్తున్నప్పటికీ, దీనిపై మాత్రం ఆయన ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇక ఈ దర్శకుడు చిరంజీవితో కాకుండా మరో తెలుగు యువ హీరోతో సినిమా చేయబోతున్నట్లు ఓ వార్త వైరల్ అవుతుంది.

# ఇక్కడ నేర్చుకున్నది అక్కడ ప్రదర్శించే అవకాశం



హిందీలో తన అందచందాలతో క్రేజీ కథానాయికగా అలరిస్తోంది దిశా పటానీ. ఆమె హాలీవుడ్‌లోకి కూడా అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. 'స్టాటిగార్డ్స్ వర్సెస్ హోలీగార్డ్స్ సాగా'లోని మొదటి చిత్రం 'ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్'లో దిశా నటిస్తుంది. ఇందులో ఆమె జెస్సికా పాత్రను పోషిస్తున్నట్లు శుక్రవారం విడుదలైన ట్రైలర్‌తో స్పష్టం చేసింది చిత్రబృందం. ఈ చిత్రం గురించి దిశ మాట్లాడుతూ... ''ఇది చాలా ప్రత్యేకమైన ప్రాజెక్టు. ట్రైలర్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూశాను. తొలి అంతర్జాతీయ చిత్రంలో నటించడం మొదట థ్రిల్లింగ్‌గా అనిపించినా తర్వాత కొంచెం భయం వేసింది. కానీ, దీని వల్ల నటిగా నా నైపుణ్యాన్ని అన్వేషించుకునే అవకాశం లభించింది. అనుభవజ్ఞులైన, విభిన్నమైన నటీనటులతో కలిసి పనిచేయడం ఒక గొప్ప పాఠం నేర్పింది. కథ చెప్పడం అనేది భాష, భౌగోళిక సరిహద్దులకు అతీతమైనది. నటనలోని నిజాయతీనే విశ్వవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు మరింత దగ్గర చేస్తుంది. స్వదేశంలో నేను నేర్చుకున్నదానిని ప్రపంచ వేదికపైకి తీసుకొచ్చే అవకాశం ఈ సినిమా కల్పించింద''ని చెప్పింది. స్పేసీ, టైరిస్ గిబ్సన్, డాల్ఫ్ లండ్‌గ్రెన్‌లతో దిశా ఇందులో నటిస్తోంది. సూపర్ నేచురల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి కెవిన్ స్పేసీ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ఏడాది విడుదల కానుందీ సినిమా. దిశ త్వరలోనే నటుడు ఇమ్రాన్ హష్మీ సరసన 'ఆవరాపన్ 2' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించడానికి ముస్తాబవుతుంది. అగ్రహీరో అక్షయ్ కుమార్ 'వెలకమ్ టు ది జంగిల్'లోనూ నటిస్తోంది.

# బుకింగ్స్ ఓపెన్ చేసిన గ్లోబల్ స్టార్.. అమెరికాలో 'పెద్ది' సందడి..



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న "పెద్ది" సినిమాపై అంచనాలు మామూలుగా లేవు. ఈ క్రేజీ పాన్ ఇండియా మూవీ జూన్ 4న గ్రాండ్‌గా రిలీజ్ అవుతుండగా, అమెరికాలో మాత్రం ఒకరోజు ముందే అంటే జూన్ 3న భారీ ఎత్తున ప్రీమియర్స్ పడబోతున్నాయి. తాజాగా నార్త్ అమెరికాకు సంబంధించి బుకింగ్స్ ఓపెన్ అవ్వడమే కాకుండా, టికెట్ ధరలను కూడా అధికారికంగా ప్రకటించారు.

**తెలుగు వెర్షన్ టికెట్ ధరలు:**

ప్రీమియర్స్ (జూన్ 3): స్టాండర్డ్ 2D స్క్రీన్ల కోసం పెద్దలకు $25, పిల్లలకు $20 గా ఫిక్స్ చేశారు. ఒకవేళ మీరు బిగ్ స్క్రీన్లు (PLF) లేదా స్పెషల్ ఫార్మాట్లలో చూడాలనుకుంటే అదనంగా మరో $5 నుండి $10 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇక సినిమా రిలీజ్ అయిన మొదటి వారం టికెట్ రేట్లు కొంచెం తగ్గుతాయి. పెద్దలకు $20, పిల్లలకు $18 గా ఉండబోతున్నాయి. ఇక హిందీ, తమిళం, కన్నడ,మలయాళ వెర్షన్లకు మాత్రం ప్రీమియర్ రేట్లు ఉండవు. మొదటి రోజు నుండే సాధారణ ధరలకే టికెట్లు అందుబాటులో ఉంటాయి. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. శివ రాజ్‌కుమార్, జగపతి బాబు వంటి భారీ స్టార్ కాస్ట్ ఉండటంతో అమెరికా బాక్సాఫీస్ వద్ద చరణ్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

# 'పెద్ది'పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్.. నా పాత్ర అలా ఉండబోతుంది

టాలీవుడ్ సీనియర్ నటుడు జగపతిబాబు తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తాను నటించిన పెద్ది గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా తన పాత్ర గురించి మాట్లాడుతూ పలు ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించారు. జగపతిబాబు మాట్లాడుతూ... "నేను రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' సినిమాలో నటించాను. ఈ చిత్రంలో నా పాత్ర చాలా అద్భుతంగా ఉంటుంది. నా పాత్ర ట్రీట్మెంట్‌ను కూడా బుచ్చిబాబు చాలా కొత్తగా డిజైన్ చేశారు.

సినిమా విడుదలైన తర్వాత నా పాత్రను చూసి ప్రేక్షకులు ఖచ్చితంగా సర్ప్రైజ్ అవుతారు" అని అన్నారు. అలాగే ఈ సినిమా భారీ విజయాన్ని సాధిస్తుందని, ఇందులో పనిచేసిన నటీనటులు, టెక్నీషియన్స్, నిర్మాతలకు మంచి గుర్తింపు తీసుకువస్తుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఇప్పటికే జగపతిబాబు పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేయగా అది ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. దీంతో ఆయన పాత్రపై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. మరి ఈ సినిమాతో జగపతిబాబుకు ఎలాంటి గుర్తింపు వస్తుందో చూడాలి. పెద్ది చిత్రాన్ని జూన్ 4న తెలుగుతో పాటు తమిళ్, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో భారీ స్థాయిలో విడుదల చేయనున్నారు.



# వీరభద్రుడు ప్రీ రిలీజ్ ఈవెంట్ తేదీ.. వేదిక ఖరారు

సూర్యతాజాగా నటించిన చిత్రం 'కరుప్పు'. ఈ సినిమాను తెలుగులో 'వీరభద్రుడు' అనే టైటిల్‌తో విడుదల చేయనున్నారు. మూవీని తెలుగులో కూడా భారీ స్థాయిలో రిలీజ్ చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అందులో భాగంగా ప్రచార కార్యక్రమాలను జోరుగా నిర్వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన తెలుగు ప్రీ రిలీజ్ ఈవెంట్‌పై అధికారిక ప్రకటన విడుదలైంది. ఈ వేడుకను రేపు, అనగా మే 11వ తేదీన సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్‌లో నిర్వహించనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. అలాగే ఈరోజు ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటే సినిమాపై అంచనాలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇక ఈ సినిమాలో త్రిష హీరోయిన్‌గా నటించగా, ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించారు. సాయి అభ్యంకర్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. మే 14న ఈ చిత్రాన్ని తమిళంతో పాటు తెలుగులో కూడా విడుదల చేయనున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమాను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ విడుదల చేయనుంది.




# ఆ ఆరు నెలలు నరకం చూశా..

బాలీవుడ్ స్టార్ నటి కియారా అద్వానీ, తల్లి అయిన తర్వాత తన జీవితంలో చోటు చేసుకున్న భావోద్వేగ మార్పుల గురించి మొదటిసారి మనసు విప్పి మాట్లాడారు. 2025 జూలైలో తన కుమార్తె సారాయకు జన్మనిచ్చిన తర్వాత, తను ఎదుర్కొన్న పోస్ట్‌పార్టమ్ (బిడ్డ పుట్టిన తర్వాత వచ్చే మానసిక స్థితి) దశ గురించి ఒక ఇంటర్వ్యూలో వివరిస్తూ ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. బిడ్డ పుట్టిన తర్వాత తన గుర్తింపు పూర్తిగా మారిపోయిందని కియారా తెలిపారు. "మొదటి ఆరు నెలలు నాపై నాకు జాలి చూపించుకోవడం కూడా చాలా కష్టంగా అనిపించేది నరకం చూశా. ఎప్పుడూ ఇతరుల గురించి ఆలోచించే నేను, మొదటిసారి నా కోసం నేను సమయం కేటాయించుకోవాలని గ్రహించాను. నాలోని భావాలను అర్థం చేసుకోవడానికి, నన్ను నేను ప్రేమించుకోవడానికి ఈ మాతృత్వం ఒక గొప్ప మలుపులా నిలిచింది" అని కియారా ఎమోషనల్ అయ్యారు.

తన కష్టకాలంలో భర్త సిద్ధార్థ్ మల్హోత్రా అందించిన మద్దతును కియారా కొనియాడారు. "ఆ రోజుల్లో నేను చాలా సున్నితంగా ఉండేదాన్ని, చిన్న చిన్న విషయాలకే ఏడ్చేసేదాన్ని. సిద్ధార్థ్ తన సినిమా ప్రమోషన్లలో బిజీగా ఉన్నా, అర్ధరాత్రి వేళ కూడా మా అమ్మ ఇంటికి వచ్చి నన్ను కలిసేవాడు. డాక్టర్ సలహా మేరకు నన్ను ప్రతిరోజూ రాత్రి పూట బయట డ్రైవ్‌కు తీసుకెళ్లేవాడు. ఆ చిన్న ప్రయాణం నాకు స్వచ్ఛమైన గాలిని, మానసిక ప్రశాంతతను ఇచ్చేది" అని ఆమె చెప్పుకొచ్చారు. కాగా.. 2023లో పెళ్లి చేసుకున్న ఈ జంట, గతేడాది పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. ప్రస్తుతం కియారా తన తదుపరి చిత్రం 'టాక్సిక్' విడుదలకు సిద్ధమవుతోంది. కన్నడలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో యష్, నయనతార వంటి స్టార్లతో కలిసి ఆమె నటిస్తోంది. మాతృత్వంలోని కష్టసుఖాలను దాటుకుని, మళ్లీ వెండితెరపై మెరవడానికి కియారా సిద్ధంగా ఉన్నారు. ఇందులో రుక్మిణి వసంత్, తారా సుతారియా కూడా కీలక పాత్రలో కనిపించబోతున్నారు.



Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394